# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :236 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: ఆదివారం 24-11-2024 | పేజీలు:4 వెల: 2.00


## వికారాబాద్ జిల్లాలో దారుణహత్య

ధారూర్, నవంబర్ 23 : వికారాబాద్ జిల్లా ధారూర్ మండల పరిధిలోని కుమ్మర్ పల్లి గ్రామంలో వ్యక్తి దారుణహత్యకు గురయ్యాడు. ఈ ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం%ొ% కుమ్మర్ పల్లి గ్రామానికి చెందిన విస్లవత్ పాండు హైదరాబాద్ నగరంలో రైల్వే స్టేషన్ పార్కింగ్ లో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం రాత్రి సమయంలో తన సొంత గ్రామమైన కుమ్మర్ పల్లి గ్రామానికి వచ్చాడు. ఇంట్లో భార్యకు మటన్ వండమని చెప్పాడు. ఇంట్లో ఉండగా ఫోన్ రావడంతో బయటికి వెళ్లాడు. తిరిగి ఇంటికి రాలేదని భార్య సంతోష తెలిపింది. ఇవాళ ఉదయం గ్రామానికి చెందిన కొందరు యువకులు వాకింగ్ కు వెళ్లగా శవాన్ని చూసి పాండు శవంగా గుర్తించారు. వెంటనే కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. ఘటన స్థలానికి చేరుకుని పాండు మృతదేహాన్ని చూసి కన్నీరు మున్నీరయ్యారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పాండు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వికారాబాద్ ప్రభుత్వ అసుపత్రికి తరలించారు.

# కోటి దాటిన కులగణన...



హైదరాబాద్,రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే శుక్రవారం మరో కీలక మైలురాయిని అధిగమించింది. రాష్ట్రంలోని కోటి కుటుంబాల గణనను అతి తక్కువ వ్యవధిలో పూర్తి చేసింది. సామాజిక సాధికారత ధ్యేయంగా అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ బృహత్తర ప్రయత్నం ఇప్పుడు అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. నవంబర్ 6న ప్రారంభమైన ఈ సర్వే ద్వారా 16 రోజుల్లో కోటి కుటుంబాల గణన పూర్తయింది. దేశానికే ఆదర్శంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇంత తక్కువ సమయంలోనే కోటి కుటుంబాల వివరాలను సేకరించి కొత్త రికార్డు నెలకొల్పింది. మొత్తం 33 జిల్లాల్లో శుక్రవారం నాటికి దాదాపు ఎనిమిది జిల్లాల్లో సర్వే పూర్తయింది. ములుగు, జనగాం జిల్లాల్లో వందకు వంద శాతం పూర్తి కాగా%ొ%. నల్గొండ, మెదక్లో 99.9 శాతం, యాదాద్రి భువనగిరి, జగిత్యాల, గద్వాలలో 99శాతం శాతం సర్వే పూర్తయింది. కామారెడ్డిలో 98.5 శాతం, మంచిర్యాల, అసిఫాబాద్, నిజామాబాద్, సిరిసిల్ల జిల్లాల్లో 98 శాతం సర్వే జరిగింది. వేరే ప్రాంతాల్లో నివాసముంటున్న వారు, ఇండ్లకు తాళాలున్నవి.. ఇలాంటివి మినహాయిస్తే వీటన్నింటా సర్వే పూర్తయిందని అధికారులు తెలిపారు.

# కాంగ్రెస్‌పై బండి సంజయ్ సంచలన ఆరోపణలు



కరీంనగర్: తెలంగాణ నుంచి మహారాష్ట్ర ఎన్నికల కోసం కాంగ్రెస్ డబ్బులు పంపిందని కేంద్ర మంత్రి, బీజేపీ కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ సంచలన ఆరోపణలు చేశారు. మహారాష్ట్రలో కాంగ్రెస్ ఓటమికి కారణం.. తెలంగాణ, కర్ణాటకలో పాలనేనని విమర్శించారు. మహారాష్ట్రలో బీజేపీ చరిత్ర సృష్టించిందని బండి సంజయ్ అన్నారు. ఎన్డీఏ కూటమికే ప్రజలు పట్టం కట్టారని చెప్పారు. మహారాష్ట్రలో మోదీ అభివృద్ధి మంత్రం పనిచేసిందని తెలిపారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని మహా సత్య దేవాలయం ఆవరణలో ఇవాళ(శనివారం) కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. గతంలో కంటే ఎక్కువ సీట్లు బీజేపీ సాధించిందని అన్నారు. కాంగ్రెస్ సీఎంలు అంతా కలిసి ప్రచారం చేసినా ఆ పార్టీని మహారాష్ట్ర ప్రజలు నమ్మలేదని అన్నారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ప్రచారం చేసిన చోట కూడా కాంగ్రెస్ ఓడిపోయిందని చెప్పారు. కాంగ్రెస్ తప్పుడు ప్రచారాన్ని మహా ప్రజలు నమ్మలేదని. తెలంగాణ కాంగ్రెస్‌కు ఇదే గతి పడుతుందని బండి సంజయ్ విమర్శించారు. కాంగ్రెస్ తప్పుడు ప్రచారాన్ని మహారాష్ట్ర ప్రజలు నమ్మలేదని అన్నారు. మహారాష్ట్రలో విజయ దంక మోగించామని ఉద్ఘాటించారు. మోదీ నాయకత్వాన్ని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. సిద్ధాంతానికి వ్యతిరేకంగా శివసేన వెళ్లిందని అన్నారు. తెలంగాణ కాంగ్రెస్‌కు ఇదే గతి పడుతుందని చెప్పారు. తెలంగాణలో ఇచ్చిన ఒక్క హామీ కూడా ఎందుకు నెరవేర్చలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టే అవకాశం ఇంకొకరికి ఇవ్వరని... వాళ్లలో వాళ్లే ప్రభుత్వాన్ని కూల్చుకుంటారని ఎద్దేవా చేశారు. తాము కూల్చాలని అనుకోవడం లేదని చెప్పారు. మహా ఫలితాలతో తెలంగాణ కాంగ్రెస్‌లో లకలుకలు తప్పవని హెచ్చరించారు. తెలంగాణలో మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రజల్లో తిరిగే పరిస్థితి లేదని బండి సంజయ్ కుమార్ పేర్కొన్నారు.

# మహా రాజకీయాల్లో శరద్ పవార్ శకం ముగిసినట్లేనా?



ముంబై: రాజకీయ కురువృద్ధుడు, ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్ ప్రభ మహారాష్ట్రలో క్రమంగా మసకబారుతోంది. కాంగ్రెస్ పార్టీ నుంచి విడిపోయిన ఆయన ఎన్సీపీని స్థాపించి రాష్ట్ర రాజకీయాలను శాసించారు. అయితే ఆయన అన్న కుమారుడు అజిత్ పవార్ పార్టీని చీల్చి బీజేపీ పక్షాన చేరారు. దీంతో తాను ప్రారంభించిన పార్టీ తనకు కాకుండా పోయింది. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో తన మార్కు రాజకీయాలు నడిపించాలని చూసిన ఆయనకు మరాఠా ప్రజలు పట్టించుకోలేదు. ఎంవీయే కూటమిలో భాగంగా 86 స్థానాల్లో పోటీచేసిన శరద్ పవార్ ఎన్సీపీ వర్గం కేవలం 13 సీట్లకు పరిమితమైంది. ఇక ఎన్డీయే కూటమిలో ఉన్న అజిత్ పవార్‌ని ఎన్సీపీ 59 స్థానాల్లో బరిలో నిలిచి 37 చోట్ల ఆధిక్యంలో కొనసాగుతోంది. బారామతి నుంచి పోటీచేసిన అజిత్ తన సోదరుని కుమారుడు, ఎన్సీపీ (ఎస్పీ) అభ్యర్థి యుగేంద్ర పవార్‌పై ఘన విజయం సాధించారు. దీంతో బాబాయ్‌పై తనదే పైచేయి అని మరోసారి నిరూపించుకున్నారు. వృద్ధాప్యంలో ఉన్న శరద్ పవార్.. ఇకపై మరాఠా ఓటర్లపై ఎంతవరకు ప్రభావం చూపుతుందనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. బీజేపీ, అజిత్‌ను తట్టుకుని ఆయన కూతురు, ఎంపీ సుప్రియ సూలే పార్టీని నిలబెట్టగలుగుతారా అని సర్వత్రా చర్చ సాగుతోంది. ఇక, అధికారం కోసం శివసేన, ఎన్సీపీలను చీల్చిన బీజేపీకి ఈ ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని అంతా అనుకున్నప్పటికీ.. అది కార్యరూపం దాల్చింది. మరోసారి ఎన్డీయే కూటమికే మరాఠీలు పట్టం కట్టారు. 220 స్థానాలతో తిరుగులేని మెజార్టీ ఇచ్చారు. దీంతో బీజేపీ మరోసారి అధికారాన్ని చేజిక్కించుకుంది. బీజేపీకి 126 స్థానాలు రాగా, శివసేన (శిండే)కు 55, ఎన్సీపీకి 38 సీట్లు వచ్చాయి.

# మహారాష్ట్ర సీఎం ఎవరు..? ఏక్‌నాథ్ షిండే సంచలన వ్యాఖ్యలు..



ముంబై:మహారాష్ట్ర ఎన్నికల్లో బీజేపీ కూటమి "మహాయుతి" సత్తా చాటింది. రాష్ట్రంలో ఘన విజయం దిశగా వెళ్తోంది. మహాయుతిలోని బీజేపీ, షిండే శివసేన, అజిత్ పవార్ ఎన్సీపీ పార్టీలు భారీ విజాయాన్ని అందుకున్నాయి. మొత్తం 288 అసెంబ్లీ స్థానాల్లో బీజేపీ కూటమి 220కి పైగా స్థానాల్లో ఆధిక్యంలో ఉంది. 125 సీట్లలో బీజేపీ సింగిల్ లార్జెస్ట్ పార్టీగా నిలిచింది. ఇదిలా ఉంటే, తాజాగా బీజేపీ కూటమి విజయం ఖరారవుతున్న సందర్భంలో మహారాష్ట్ర సీఎం ఎవరనేదానిపై సస్పెన్స్ నెలకొంది. ప్రస్తుత ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేకే పదవి లభిస్తుందా..? లేదా దేవేంద్ర ఫడ్నవీస్‌కి సీఎం పదవి వస్తుందా.? అనే ఆసక్తి నెలకొంది. ముఖ్యమంత్రి పదవిపై ప్రస్తుత సీఎం షిండే కీలక వ్యాఖ్యలు చేశారు. "ఎక్కువ సీట్లు వచ్చిన పార్టీకే సీఎం సీటు ఇవ్వాలనే రూలేం లేదు. అంతిమ ఫలితాలు రానివ్వండి.. మూడు పార్టీలు కలిసి పోటీ చేసినట్లే, మూడు పార్టీల నేతలు సమావేశమై నిర్ణయం తీసుకుంటాం. మా అగ్రనేతలు మోడీ, అమిత్ షాలను సంప్రదించి నిర్ణయం తీసుకుంటాం" అని చెప్పారు. మేం చేసిన అభివృద్ధిని చూసి మా కూటమికి పట్టం కట్టారని షిండే అన్నారు. ఒక వైపు సంక్షేమ పథకాలు, మరోవైపు అభివృద్ధిని చేశామని అన్నారు.

మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా దేవేంద్ర ఫడ్నవిస్: బీజేపీ

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో మహాయుతి సంచలనం సృష్టించింది. ట్రెండ్స్ ప్రకారం బీజేపీ కూటమి 210కి పైగా సీట్లలో ఆధిక్యంలో ఉంది. ఈ సందర్భంగా మహారాష్ట్ర ముఖ్యమంత్రి పదవిని ఎవరు దక్కించుకుంటారు అనే దానిపై ఉత్కంఠ కొనసాగుతుంది. తాజాగా, దీనిపై బీజేపీ నేత ప్రవీణ్ దారేకర్ హాట్ కామెంట్స్ చేశారు. ఎక్కువ సీట్లు వచ్చిన పార్టీయే సీఎం పీఠాన్ని దక్కించుకుంటుందని చెప్పుకొచ్చారు. బీజేపీకి ఎక్కువ సీట్లు వస్తాయి.. మాకు దాదాపు 125 సీట్లు రాబోతున్నాయి.. ఇక, దేవేంద్ర ఫడ్నవీస్ ముఖ్యమంత్రి అవుతారని కమలం పార్టీ నేత ప్రవీణ్ దారేకర్ చెప్పుకొచ్చారు. కాగా, ప్రస్తుత ఎన్నికల ఫలితాల్లో బీజేపీ ఒంటరిగా 110 సీట్ల పైగా కైవసం చేసుకోవడంతో.. దేవేంద్ర ఫడ్నవీస్ ముఖ్యమంత్రి పదవిపై వాదన బలంగా వినిపిస్తున్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించడంతో కమలం అధినేతే సీఎంగా కూర్చునే అవకాశం ఉంది. కాగా, ఏక్ నాథ్ షిండే వర్గం నిర్ణయంపై ఉత్కంఠ కొనసాగుతుంది. సీఎం పదవిని వదులుకునే ప్రసక్తే లేదన్న షిండే వర్గం తేల్చి చెప్పింది. దీంతో ముంబైలో ఫడ్నవీస్ నివాసంలో బీజేపీ కీలక సమావేశం ఏర్పాటు చేయగా.. పార్టీ అగ్రనేతలు పాల్గొన్నారు. రాష్ట్ర సీఎం పదవిని ఫడ్నవీస్ చేపట్టాలని బీజేపీ నేతల డిమాండ్ చేస్తున్నారు.

# గ్రేటర్‌లో మరింత పట్టు సాధించేందుకు బీఆర్ఎస్ స్కెచ్



హైదరాబాద్,గ్రేటర్ హైదరాబాద్‌పై మరింత పట్టు సాధించేందుకు పావులు కదుపుతోంది బీఆర్ఎస్. తమ పార్టీ నుంచి గెలిచి..కాంగ్రెస్‌లో చేరిన మేయర్, డిప్యూటీ మేయర్లకు అవిశ్వాసంతో ఝలక్ ఇచ్చేందుకు రెడీ అవుతోంది. మేయర్‌గా గద్వాల్ విజయలక్ష్మి పదవి బాధ్యతలు చేపట్టి నాలుగేళ్లు పూర్తి కావడంతో అవిశ్వాసం పెట్టేందుకు ప్లాన్ చేస్తోంది బీఆర్ఎస్. నో కాన్ఫిడెన్స్ మోషన్ పెట్టే వ్యూహం వర్కౌట్ అయితే చాలా అంశాలపై క్లారిటీ వస్తుందని భావిస్తోంది గులాబీ దళం. ములాఖత్ విమర్శలకు చెక్ పెట్టేందుకే అవిశ్వాసం రూటు ఎంచుకుందట బీఆర్ఎస్. రాష్ట్రంలో ఇప్పటికే కుమ్మక్కు రాజకీయాల టాపిక్ ట్రెండింగ్‌లో ఉంది. బీఆర్ఎస్, బీజేపీ కలిసి పనిచేస్తున్నాయని కాంగ్రెస్ అంటుంటే..బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటేనని బీఆర్ఎస్ అంటోంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటేనని బీజేపీ విమర్శిస్తోంది. ఇంతకీ ఎవరు ఎవరితో ములాఖత్ అయ్యారో తేలిపోయే సమయం వచ్చేసిందంటోంది బీఆర్ఎస్. గ్రేటర్ హైదరాబాద్ వేదికగా తాము ఎవరితో కుమ్మక్కు కాలేదని..సింగిల్‌గానే ఉన్నామని తేల్చి చెప్పేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

14 మంది కార్పొరేటర్లు హస్తం గూటికి

పార్లమెంట్ ఎన్నికలకు ముందు మేయర్ గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి సహా 14 మంది కార్పొరేటర్లు హస్తం గూటికి చేరారు. మేయర్, డిప్యూటీ మేయర్ పార్టీ మారడంతో గ్రేటర్‌లో గులాబీపార్టీ పట్టు సడలినట్లు అయింది. లేటెస్ట్ రాజకీయ పరిణామాలతో కాంగ్రెస్, బీజేపీలకు చెక్ పెడుతూనే..ఎంఐఎం తీరును తెలియజేసేలా అవిశ్వాస అస్త్రాన్ని ప్రయోగించేందుకు రెడీ అవుతోంది బీఆర్ఎస్. గులాబీ పార్టీ 55 కార్పొరేటర్ స్థానాలను గెలుచుకొని అతిపెద్ద పార్టీగా అవతరించింది. బీజేపీ 48 స్థానాలతో రెండోస్థానంలో, 44 స్థానాలతో ఎంఐఎం మూడోస్థానం దక్కించుకుంది. గ్రేటర్ పరిధిలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీల ఎక్స్‌అఫిషియో సభ్యుల మద్దతుతో గులాబీ పార్టీ మేయర్, డిప్యూటీ మేయర్ స్థానాలను ఈజీగా తమ ఖాతాలో వేసుకోగలిగింది. మేయర్, డిప్యూటీ మేయర్ పార్టీ మారడంతో ఆ పదవులను తిరిగి సొంతం చేసుకోవాలని ప్లాన్ చేస్తోంది.

బీఆర్ఎస్ అవిశ్వాసం పెడితే?


లేటెస్ట్ పొలిటికల్ సిచ్యువేషన్‌లో కాంగ్రెస్, బీజేపీ వైఖరిని తెలియజేసేందుకు మేయర్, డిప్యూటీ మేయర్లపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టే యోచనలో గులాబీ దళం ఉన్నట్లు తెలుస్తోంది. మేయర్, డిప్యూటీ మేయర్ పదవులు నిలబెట్టుకోవాలంటే కాంగ్రెస్ పార్టీ ఒంటరిగా అవిశ్వాసం నెగ్గే అవకాశం లేనేలేదు. అవిశ్వాసంలో కాంగ్రెస్ నెగ్గాలంటే మరో పార్టీ మద్దతు కచ్చితంగా అవసరం. బీఆర్ఎస్ అవిశ్వాసం పెడితే బీజేపీ మద్దతు ఇచ్చే అవకాశం దాదాపు లేదు. ఇదే సమయంలో ఎంఐఎం అధికార పార్టీకి సహకరించే అవకాశం ఉంటుంది. ఎంఐఎం, కాంగ్రెస్‌కు సహకరిస్తే చోటుచేసుకునే పరిణామాలను బేరీజు వేసుకుంటుందట బీఆర్ఎస్. అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెడితే రాజకీయ సమీకరణలు ఎలా ఉంటాయన్న దానిపై గులాబీ పార్టీ ముమ్మరంగా కసరత్తు చేస్తుందంటున్నారు. అవిశ్వాసం నెగ్గినా..నెగ్గకపోయినా..ఏదో ఒక విషయం అయితే క్లారిటీ వస్తుందని అనుకుంటుందట బీఆర్ఎస్. అవిశ్వాసం నెగ్గితే గ్రేటర్‌లో కీలకమైన మేయర్, డిప్యూటీ మేయర్ పదవులను కొత్త నేతలకు ఇస్తే జోష్ పెరుగుతోందని అనుకుంటుందట. అవిశ్వాసం వీగితే కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇస్తున్న పార్టీలేంటో కూడా క్లారిటీ వస్తుందని భావిస్తోంది బీఆర్ఎస్. దీంతో క్షేత్రస్థాయిలో రాజకీయంగా గులాబీ పార్టీ వ్యూహాలకు మరింత పదును పెట్టే అవకాశం దక్కుతుందని గులాబీ పార్టీ అంచనా వేస్తోంది.

# ఇది ప్రజా తీర్పుకాదు..సంజయ్ రౌత్ సంచలన వ్యాఖ్యలు



ముంబై: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడుతున్నాయి. ఎర్లీ ట్రెండ్ ప్రకారం మహాయుతి కూటమి అత్యధిక స్థానాల్లో ఆధిక్యంలో దూసుకెళ్తోంది. మ్యాజిక్ ఫిగర్ 145 స్థానాలు దాటేసి.. 221 స్థానాల్లో ఆధిక్యంలో ఉంది. ఇందులో బీజేపీ 128 స్థానాల్లో ముందంజలో ఉంది. ప్రతిపక్ష మహావికాస్ అఘాడీ కూటమి కేవలం 52 స్థానాల్లో మాత్రమే ముందంజలో కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఎన్నికల ఫలితాలపై శివసేన (యూటీబీ) నేత సంజయ్ రౌత్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇది ప్రజా తీర్పు కాదన్నారు. ఈవీఎంలను ట్యాంపరింగ్ చేసి ఎన్డీయే గెలుస్తోందని ఆరోపించారు. 'ఫలితాల సరళి చూస్తుంటే ఏదో తప్పుజరిగినట్లు అనిపిస్తోంది. వాళ్లు ఏదో గోల్‌మాల్ చేశారు. మా సీట్ల కొన్ని దోచుకున్నారు. ఇది ప్రజల నిర్ణయం కానేకాదు. ఇక్కడ జరిగిన తప్పేంటో అందరికీ అర్థం అవుతోంది. ఈ ఫలితాలతో ప్రజలు కూడా ఏకీభవించడం లేదు. షిండేకు 60 సీట్లు, అజిత్ పవార్‌కు 40, బీజేపీకి 125 సీట్లు రావడం సాధ్యమేనా..? ఈ రాష్ట్ర ప్రజలు నిజాయితీ పరులు' అని పేర్కొన్నారు. ఏక్ నాథ్ షిండే వర్గానికి చెందిన అభ్యర్థులు అందరూ ఆధిక్యంలో కొనసాగడంపై ఆయన అనుమానం వ్యక్తం చేశారు. బాల్ థాక్రే స్థాపించిన శివసేనను చీల్చిన ఏక్ నాథ్ షిండే, ఎన్సీపీ పార్టీని చీల్చిన అజిత్ పవార్‌పై మరాఠా ప్రజలు ఆగ్రహంతో ఉన్నారన్నారు. వారు చేసిన మోసాన్ని మహారాష్ట్ర ప్రజలు ఎలా మరిచిపోతారని అన్నారు. కొన్ని నెలల క్రితం జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో తమకు స్పష్టమైన ఆధిక్యం వచ్చిందని.. ఫలితాలు ఇప్పుడెలా మారాయని అనుమానం వ్యక్తం చేశారు. ఇది ముమ్మాటికీ ప్రజా తీర్పు కాదని.. ఈవీఎంలను ట్యాంపరింగ్ చేసి మహాయుతి కూటమి గెలుస్తోందని ఆరోపించారు. మహారాష్ట్రలో ప్రజాస్వామ్యం మరోసారి ఖూనీ అయిందని నిరూపితం అయిందని సంజయ్ రౌత్ వ్యాఖ్యానించారు.

# జమిలి ఎన్నికలపై చంద్రబాబు కీలక వ్యాఖ్యలు..



అమరావతి, దేశవ్యాప్తంగా జమిలి ఎన్నికలపై చర్చ సాగుతోంది.. వన్ నేషన్ – వన్ ఎలక్షన్ నినాదంతో నరేంద్ర మోడీ సర్కార్ ముందుకు వెళ్తోంది..జమిలి ఎన్నికలే వస్తే.. 2027లోనే దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు జరుగుతాయనే చర్చ సాగుతోంది.. అయితే, ఈ తరుణంలో టీడీపీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.. జమిలి ఎన్నికలపై కీలక వ్యాఖ్యలు చేశారు.. జమిలి ఎన్నికలు వచ్చినా ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికలు మాత్రం 2029లోనే ఉంటాయన్నారు.. పార్లమెంట్, అసెంబ్లీలకు కేంద్రం జమిలి ఎన్నికలు పెట్టినా.. అవి షెడ్యూల్ ప్రకారం 2029లోనే వస్తాయని.. ముందుగా రాబోవని స్పష్టం చేశారు సీఎం చంద్రబాబు..ఇక, విజన్–2047ను కింది స్థాయి వరకూ ప్రజల్లోకి తీసుకెళ్లడంపై ఆలోచనలు చేస్తున్నామని తెలిపారు ఏపీ సీఎం చంద్రబాబు.. మరోవైపు.. వైఎస్ జగన్ కు అదానీ 1750 కోట్ల రూపాయలు లంచం ఇచ్చారనే అంశంపై న్యాయ సలహా తీసుకుని స్పందిస్తాం అన్నారు.. విజన్ 2047 కోసం నిధుల సమీకరణకు వినూత్న పంథాలో ముందుకు వెళ్తామని చెప్పారు.. కాలేజీలు, విశ్వవిద్యాలయాల వంటి వేదికలపై చర్చిస్తాం. ఈ విజన్ ద్వారా రాష్ట్రాన్ని ఎలా ముందుకు తీసుకెళ్లాలనుకుంటున్నామో అన్ని వర్గాలవారికీ తెలియడానికి ప్రణాళిక రూపొందించుకుని పనిచేయనున్నట్టు వెల్లడించారు.. ఈ ప్రక్రియ నిరంతరం జరుగుతూ ఉంటుంది. ప్రతి నెల, ప్రతి క్వార్టర్, ప్రతి ఏడాదికి లక్ష్యాలు పెట్టుకుని సాధించడానికి ప్రయత్నిస్తామన్నారు.. అయితే, సోమవారం నుంచి పార్లమెంటు శీతాకాల సమావేశాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో శుక్రవారం రాత్రి తన నివాసంలో టీడీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం నిర్వహించారు సీఎం చంద్రబాబు.. సమావేశం అనంతరం.. కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంలో ప్రాజెక్టుల గురించి చర్చించాం.. ఇరిగేషన్, నదుల అనుసంధానం ప్రాజెక్టుల గురించి చర్చించామన్నారు. స్వర్ణాంధ్రప్రదేశ్ 2047ను కూడా చంద్రబాబు రిలీజ్ చేసారు.. దానిలోనూ కేంద్ర అనుసంధాన పనులున్నాయని తెలిపారు. పెట్టుబడులను తీసుకురావడంలో కేంద్రంతో అనుసంధానం చేసి పూర్తి చేయడంలో ముందుండాలని సీఎం సూచించారని పేర్కొన్నారు. అయితే, జమిలి ఎన్నికలపై మీడియా చిట్‌చాట్‌లో కీలక వ్యాఖ్యలు చేశారు సీఎం చంద్రబాబు నాయుడు.

## డిసెంబర్ 7న రాష్ట్రవ్యాప్తంగా ఆటోల బంద్

హైదరాబాద్: ఆటో డ్రైవర్ల తమ డిమాండ్ల సాధనకు వచ్చే నెల 7న రాష్ట్రవ్యాప్తంగా ఆటోల బంద్ చేపట్టనున్నారు. బంద్‌తో పాటు హైదరాబాద్‌లో లక్ష మందితో భారీ ర్యాలీ,బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర ఆటోడ్రైవర్స్ యూనియన్ జేఏసీ వెల్లడించింది. ఈ మేరకు బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జేఏసీ రా ష్ట్ర సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ నేతలు మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆటోడ్రైవర్ల సమస్యలను పరిష్కరించకుండా మోసం చేసిం దని, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం దారుణమని పేర్కొన్నారు. ఇక, కాంగ్రెస్ పార్టీ డ్రైవర్ల ఆందోళనలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే బీఆర్ఎస్ లాంటి పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

## సంపాదకీయం

**ఆదివారం 24-11-2024**

# బైడెన్ తప్పుడు నిర్ణయం

అధ్యక్షుడిగా ఉంటూ ఎన్నికల్లో ఓటమిపాలై ప్రత్యర్థికి అధికారం అప్పగించటం మినహా మరేమీ చేయలేని నిస్సహాయ స్థితిలోపడిన నేతను అమెరికా జనం 'లేమ్ డక్ ప్రెసిడెంట్' అంటారు. అధ్యక్షుడు జో బైడెన్ అంతకన్నా తక్కువ. ఎందుకంటే ఆయన కనీసం పోటీలో కూడా లేరు. ఎన్నికల ముహూర్తం దగ్గర పడుతుండగా అందరూ బలవంతంగా ఆయన్ను తప్పించి కమలా హారిస్‌ను బరిలో నిలిపారు. ఆ పార్టీ ఓటమి పాలైంది. ఇక అధికారం బదలాయింపు లాంఛనాలు తప్ప బైడెన్ చేయగలిగేదీ, చేసేదీ ఏమీ ఉండదు. కానీ ఆయన తగుదనమ్మా అంటూ ఉక్రెయిన్‌కు ఏడాదిన్నర క్రితం ఇచ్చిన అత్యంత శక్తిమంతమైన దీర్ఘశ్రేణి క్షిపణుల్ని వినియోగించటానికి అనుమతినిచ్చారు. దాంతోపాటు తాము సరఫరా చేసిన ప్రమాదకరమైన మందుపాతరలను కూడా వాడుకోవచ్చని ఉక్రెయిన్‌కు తెలిపారు. యుద్ధం మొదలై వేయిరోజులైన సందర్భంగా అమెరికా సరఫరా చేసిన క్షిపణులను ప్రయోగించి రష్యా భూభాగంలోని బ్రిన్స్క్ ప్రాంతంలోని కరచెవ్ భారీ ఆయుధ గిడ్డంగిని ఉక్రెయిన్ సైన్యం ధ్వంసం చేసింది. దీనికి ప్రతిగా అణ్వాయుధ వినియోగం ముసాయిదాను సవరించినట్టు రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రకటించారు. పర్యవసానంగా ప్రపంచం అణ్వస్త్ర యుద్ధం అంచులకు చేరింది. యుద్ధం మొదలయ్యాక కేవలం కొన్ని రోజుల్లో... మహా అయితే కొన్ని నెలల్లో రష్యా పాదాక్రాంతం కావటం ఖాయమన్న తప్పుడు అంచనాలతో ఉక్రెయిన్‌ను యుద్ధరంగంలోకి నెట్టింది అమెరికాయే. 2014లో పుతిన్ క్రిమియాను స్వాధీనం చేసుకున్నాక వరసగా ఎనిమిదేళ్లపాటు జరిగిన ఘర్షణలు నివారించటానికి 2022లో వాటి మధ్య శాంతి ఒప్పందం ముసాయిదాను అమెరికా, బ్రిటన్‌లే రూపొందించాయి. చిత్రమేమంటే, ఆ ఒప్పందాన్ని అటు రష్యా, ఇటు ఉక్రెయిన్ కూడా ఆమోదించాయి. ప్రాథమిక అవగాహన పత్రంపై ఇరు దేశాలూ సంతకాలు చేశాయి. కానీ ఆఖరి నిమిషంలో అమెరికా అధ్యక్షుడు బైడెన్, బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్ మనసు మార్చు కున్నారు. ఆ రెండు దేశాల సాయంతో అక్రమంగా అధికారంలోకొచ్చిన ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ వారి ఒత్తిడికి లొంగి ఏకపక్షంగా ఒప్పందం నుంచి వైదొలగారు. ఆ తర్వాతే రష్యా దురాక్రమణ యుద్ధా నికి దిగింది. అసలు రెండు నెలల క్రితం నాటి స్థితికీ, ఇప్పటికీ వచ్చిన మార్పేమిటో, ఎందుకు మూడో ప్రపంచయుద్ధం ముప్పు తీసుకొచ్చారో బైడెన్ చెప్పాలి. తాము సరఫరా చేసిన దీర్ఘశ్రేణి క్షిపణులు స్టార్మ్ షాడోలను రష్యాపై ప్రయోగించటానికి బ్రిటన్ నిరుడు అనుమతించినప్పుడు అమెరికా రక్షణ శాఖ కార్యాలయం పెంటగాన్ బైడెన్‌ను తీవ్రంగా హెచ్చరించింది. దీన్ని ఆపనట్టయితే ఇది నాటో%-%రష్యా యుద్ధంగా పరిణమిస్తుందని వివరించింది. దాంతో బైడెన్‌కు తత్వం బోధపడి బ్రిటన్‌ను వారించారు. అంతక్రితం 2022 మార్చిలో రష్యా గగనతలంపై 'నో ఫ్లైజోన్' విధించటానికి తమ మిగ్%-%29 యుద్ధ విమానాలను వాడుకోవచ్చని విదేశాంగమంత్రి బ్లింకెన్ పోలెండ్‌ను అనుమతించినప్పుడు అమెరికా ప్రతినిధుల సభంతా ఏకమై పెంటగాన్ అభిప్రాయం తర్వాతే నిర్ణయం తీసుకోవాలని వారించారు. దాంతో బైడెన్ ఆ నిర్ణయాన్ని వెనక్కు తీసుకున్నారు. 'నో ఫ్లైజోన్' విధించటమంటే మూడో ప్రపంచయుద్ధానికి అంకురార్పణ చేసినట్టేనని ఒప్పుకున్నారు. మరి ఇప్పుడేమైంది? తన పార్టీ చిత్తుగా ఓడి, కీలక నిర్ణయాలు తీసుకోలేని స్థితిలో పడినప్పుడు అనుమతినీయటం అనైతికం, బాధ్యతారాహిత్యం మాత్రమే కాదు... నేరం కూడా. ఒకపక్క జనవరిలో అధ్యక్షుడిగా రానున్న డోనాల్డ్ ట్రంప్ తన మొదటి కర్తవ్యం రష్యా%-%ఉక్రెయిన్ యుద్ధం ఆపటమేనని ఇప్పటికే ప్రకటించారు. సరిగ్గా ఇలాంటి పనే రిపబ్లికన్ పార్టీకి చెందిన జార్జి బుష్ 1992లో చేశారు. ఎన్నికల్లో ఓటమి పాలై ఇక 11 నెలల్లో దిగిపోతాననగా సోమాలియా దురాక్రమణకు ఆయన ఆదేశాలిచ్చారు. దాంతో కొత్తగా అధికారంలోకొచ్చిన క్లింటన్ అన్నీ వదిలిపెట్టి దానిపైనే చాన్నాళ్లు దృష్టి సారించాల్సి వచ్చింది. బైడెన్‌కు సైతం కేవలం 11 వారాలే గడువుంది. కనీసం నిర్ణయం తీసుకునేముందు సెనేట్‌ను సమావేశపరిచి సలహా తీసుకోవాలన్న ఇంగితం కూడా లేకపోయింది. ఈ నిర్ణయాన్ని పెంటగాన్ సీనియర్ అధికారులు వ్యతిరేకించారంటున్నారు. నిజానికి క్షిపణుల్ని వినియోగించే సామర్థ్యం, సాంకేతిక నైపుణ్యం ఉక్రెయిన్‌కు లేవు. అమెరికా నిఘా ఉపగ్రహాలు నిర్దిష్ట సమాచారం ఇస్తేనే, దాని ఆధారంగా అమెరికా సైనికాధికారులు రష్యా ఆయుధ గిడ్డంగిని ధ్వంసం చేశారని సాధారణ పరిశీలకులకు సైతం సులభంగా తెలుస్తుంది. రష్యా గ్రహించదనుకోవటం, పాపభారమంతా ఉక్రెయిన్‌పైనే పడుతుందనుకోవటం తెలివితక్కువతనం. మందుపాతరల వినియోగాన్ని పూర్తిగా ఆపేస్తామని ఐక్యరాజ్యసమితిలోని 161 దేశాలు కుదుర్చుకున్న ఓస్లో ఒడంబడికను అమెరికా, రష్యాలు కాదన్నాయి. ఆ ఒడంబడికకు కారణమైన మందు పాతరల నిరోధ ప్రచార సంస్థకూ, దాని అధ్యక్షుడు జోడీ విలియమ్స్‌కూ 1997లో నోబెల్ శాంతి బహుమతి వచ్చింది. మందుపాతరలివ్వాలన్న బైడెన్ తాజా నిర్వాకంవల్ల ఆ ఒడంబడికపై సంతకం చేసిన ఉక్రెయిన్ అపరాధిగా మారినట్టయింది. మందుపాతరల వల్ల కీయూవ్‌లోకి చొచ్చుకొస్తున్న రష్యా బలగాల వేగాన్ని కొంతవరకూ నిరోధించవచ్చు. కానీ ఆపటం అసాధ్యం. యుద్ధం పూర్తయ్యాక సాధారణ పౌరులు వందలమంది ఏదో ఒక ప్రాంతంలో నిత్యం మందుపాతరలకు బలయ్యే ప్రమాదం ఉంటుంది. బైడెన్ తప్పుడు నిర్ణయాన్ని వెంటనే సరిదిద్దకపోతే ప్రపంచ ప్రజలముందు అమెరికా దోషిగా నిలబడాల్సివస్తుంది. ఆ పరిస్థితి తెచ్చుకోరాదని అక్కడి ప్రజానీకం తెలుసు కోవాలి. ప్రభుత్వాన్ని నిలదీయాలి.

# హైడ్రాకు 100కుపైగా ఫిర్యాదులు



హైదరాబాద్,మళ్లీ హైడ్రా కూల్చివేతలు స్పీడందుకున్నట్లేనా..! అంటే అవుననే చెబుతున్నారు అధికారులు. ప్రభుత్వ స్థలాల ఆక్రమణలంటూ తమ కార్యాలయానికి వస్తున్న ఫిర్యాదులపై దృష్టి పెట్టిన హైడ్రా.. ఆయా ప్రాంతాలకు సంబంధించిన శాఖల రిపోర్టుల ఆధారంగా కూల్చివేతలను కొనసాగిస్తున్నారు. ఓఆర్ఆర్ లోపల చాలా ప్రాంతాల్లో రోడ్లు, పార్కులు కబ్జా చేశారంటూ.. కాలనీల నుంచి వచ్చిన ఫిర్యాదులపై హైడ్రా బృందాలు ఉన్నట్లుగా స్థానిక అధికారులతో కలిసి కొన్ని చోట్ల క్షేత్రస్థాయిలో పరిశీలించిన వివరాలు తెలుసుకున్నారు. ఈ సంగారెడ్డి జిల్లాతో పాటు ఓఆర్ఆర్ లోపల పలుచోట్ల కూల్చివేతలు చేసిన హైడ్రా.. ఈ రెండుమూడురోజుల్లో ప్రాంతాలలో కూల్చివేతలకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే హైడ్రా బృందం పథకం, ఇరిగేషన్, లీగల్ టీంలతో కలిసి తమ కార్యాలయానికి వచ్చిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలిస్తోంది. ఇందులో ఎక్కడ సులువుగా పని జరుగుతుందో, న్యాయపరమైన ఇబ్బందులు లేకుండా ఎక్కడ ఉంటాయో చూసుకొని.. అక్కడ తమ బృందాలతో చర్యలకు సిద్ధమవుతున్నారు. ఈ నెల రోజుల్లో హైడ్రా కార్యాలయానికి వందకు పైగా ఫిర్యాదులు వచ్చినట్లు తెలిసింది. ప్రధానంగా పలు కాలనీల్లో నాలాలు, పార్కులు, రోడ్ల ఆక్రమణలపై కాలనీలు, స్థానికుల నుంచి ఈ ఫిర్యాదులొచ్చాయి. అయితే అమీన్ మున్సిపాలిటీ పరిధిలో పటేల్‌గూడలో హైడ్రాల్చివేతలపై భూయజమానులు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో కోర్టు సర్వేకు తదుపరి చర్యల వరకు స్టేటస్ కోలు విధించింది. కోర్టు వివాదాల నేపథ్యంలో తమ కార్యాలయానికి వచ్చిన ఫిర్యాదులపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ లీగల్ టీంతో సమీక్షించారు. ఫిర్యాదుల్లో ఉన్న దాడులను తొలగించేందుకు వచ్చే న్యాయపరమైన చిక్కులపై చర్చించారు.

ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో పరిశీలన

హైడ్రా కార్యాలయానికి గత నెల వరకు వర్షాల కారణంగా ఎదురయ్యే ఇబ్బందులపై వచ్చిన ఫిర్యాదులే ఎక్కువగా రాగా ఈ నెల రోజుల నుంచి మాత్రం పార్కులు, నాలాలు, రోడ్ల దాడులకు సంబంధించిన ఫిర్యాదులు వచ్చినట్లు హైడ్రా అధికారి తెలిపారు. వీటిపై సంబంధిత శాఖల నుంచి హైడ్రా కమిషనర్ ప్రాథమిక నివేదిక. ప్రభుత్వ స్థలాల ఆక్రమణలకు సంబంధించి స్థానిక అధికారుల నుంచి నివేదిక తర్వాత వాటిపై చర్యలకు దిగినట్లు తెలిసింది.

ఔటర్ లోపల..

ఓఆర్ఆర్ లోపల జీహెచ్‌సీతో పాటు 27 మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలు హైడ్రా పరిధిలోకి వస్తాయి. వీటిలో హైడ్రాకు వచ్చిన ఫిర్యాదుల్లో ఎక్కువగా సంగారెడ్డి, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లోనే ఉన్నాయి. జీహెచ్‌సీ పరిధిలో ఉన్న పార్కులు, రోడ్ల స్థలాల ఆక్రమణలపై వచ్చిన వాటిపై హైడ్రా బృందం క్షేత్రస్థాయిలో నిల్వ వివరాలను సేకరించింది. దాడులు చేసిన వారికి నోటీసులు కూడా ఇచ్చామని వారి నుంచి వివరణ సంతృప్తికరంగా లేకపోవడంతో రెండోసారి కూడా నోటీసులు జారీ చేసినట్లు హైడ్రా అధికారులు తెలిపారు. ఇప్పటివరకు కార్యాలయానికి వచ్చిన వందకు పైగా ఫిర్యాదులను పూర్తి స్థాయిలో పరిశీలించి అందులో ఆక్రమణదారులుగా నమోదైన 40 మందికి నోటీసులు ఇచ్చారు. వారికిచ్చిన గడువు ముగిసిన తర్వాత వారి వివరణను బట్టి చర్యలకు దిగడానికి హైడ్రా సిద్ధమవుతున్నది. అయితే చాలా చోట్ల కోర్టు వివాదాలకు సంబంధించిన భూములపై ??కూడా ఫిర్యాదులు రావడంతో వాటిపై లీగల్ టీం సలహా మేరకు ముందుకు వెళ్లనున్నారు. ముందుగా రెడీ, మున్సిపల్ రికార్డులను అనుసరించి ఆక్రమణలుగా తేల్చిన వాటిని తొలగించేందుకు హైడ్రా.

# మణిపూర్‌పై ఇంకా మీన'మోషా'లేనా?

మణిపూర్:మణిపూర్‌కు అదనపు సిఆర్‌పిఎఫ్ బలగాలను పంపించడం, అయిదు జిల్లాల్లోని ఆరు పోలీస్ స్టేషన్ల పరిధిలో సాయుధ దళాల ప్రత్యేక అధికారాల చట్టాన్నిమణిపూర్‌పై ఇంకా మీన'మోషా'లేనా?మణిపూర్‌కు అదనపు సిఆర్‌పిఎఫ్ బలగాలను పంపించడం, అయిదు జిల్లాల్లోని ఆరు పోలీస్ స్టేషన్ల పరిధిలో సాయుధ దళాల ప్రత్యేక అధికారాల చట్టాన్ని (ఎఎఫ్ఎస్‌పిఎ) అమల్లో పెట్టడం, ఇంటర్నెట్‌ను నిషేధించడం, ఆందోళనకారులు ఎమ్ఎల్ఎల ఇళ్లను ధ్వంసం చేయడం జాతీయ విషాదం! ఏడాదిన్నరగా అక్కడ అంతర్యుద్ధం వంటి పరిస్థితులు కొనసాగుతూ ఉండడం దేశ పాలకుల వైఫల్యాన్నే చాటుతున్నది. బాధిత ప్రజల మనోభావాలను గౌరవించడం, సంయమనంతో కూడిన చర్చల ద్వారా సమస్యను న్యాయమైన పద్ధతిలో పరిష్కరించడం బీజేపీకి బొత్తిగా గిట్టదు. మైదాన ప్రాంతమైన ఇంఫాల్ లోయలో నివసిస్తున్న మెజారిటీ మెయితీలను కూడా ఎస్టీలుగా గుర్తిస్తూ కేంద్రానికి సిఫార్సులు పంపాలని గత సంవత్సరం ఏప్రిల్ 20న మణిపూర్ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి ఎం.వి. మురళీధరన్ జారీ చేసిన ఉత్తర్వులు గిరిజన తెగ అయిన కుకీలలో తీవ్ర అభద్రతా భావం సృష్టించి వారిని ఆందోళన మార్గం పట్టించింది. హైకోర్టు ఉత్తర్వులకు వ్యతిరేకంగా అఖిల మణిపూర్ గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్రమంతటా నిరసనకు ఇచ్చిన పిలుపు విజయవంతమైంది. ఆ తర్వాత గత ఏడాది మే 3న మెయితీ మూకలు పోలీసుల సహకారంతో కుకీ మహిళలను వివస్త్రలను చేసి హత్యాచారానికి గురి చేశారు, వారి మగవారినీ హతమార్చారు. దానితో ఉభయ వర్గాల మధ్య ఘర్షణలు పెద్ద ఎత్తున చోటు చేసుకున్నాయి. అలా కొనసాగిన హింస వల్ల 250 మందికి పైగా మరణించారు. 60,000 మందికి మించి నిర్వాసితులై పునరావాస శిబిరాల్లో దుర్భరమైన బతుకులు ఈడుస్తున్నారు. రెండు వైపులా గల ఆందోళనకారులు పోలీస్ స్టేషన్లపై దాడులు చేసి ఆయుధాలను పెద్ద సంఖ్యలో ఎత్తుకుపోయారు. ఇది కూడా హింస నిరవధికంగా కొనసాగడానికి దారి తీస్తున్నది.కొద్ది కాలం నివురు గప్పినట్టున్న మణిపూర్ ఇటీవల తిరిగి వేడెక్కడం మొదలు పెట్టింది. ఈ మధ్యనే పదిమంది కుకీలను మిలిటెంట్లుగా భావించి జిరిబమ్ జిల్లాలోని సిఆర్‌పిఎఫ్ దళాలు కాల్చి చంపారు. దానితో కుకీ తెగవారు కోపోద్రిక్తులయ్యారు. వారు మిలిటెంట్లు కాదని, తమ వాలంటీర్లు అని కుకీలు వాదిస్తున్నారు. ఆ తర్వాత ముగ్గురు మెయితీ మహిళల, వారి ముగ్గురి బాలల అపహరణ, హత్య జరిగిపోయాయి. పర్యవసానంగా 2000 మందికి పైగా అదనపు సిఆర్‌పిఎఫ్ దళాలను మణిపూర్‌కి పంపించి, అపరిమిత అధికారాలను సాయుధ దళాలకు కట్టబెడుతున్న ఎఎఫ్ఎస్‌పిఎను తిరిగి విధించారు. 2021 జనాభా లెక్కల ప్రకారం మణిపూర్ జనాభాలో 53 నుంచి 60శాతం మంది మెయితీలు, 20 శాతం మంది నాగాలు, 16 శాతం మంది కుకీలు ఉన్నారు. మణిపూర్ భూభాగంలో 89 శాతం కొండ ప్రాంతం ఉంది. ఇది గిరిజన తెగలైన నాగాలు, కుకీలు, తదితరులు నివసిస్తున్న ప్రదేశం. మెజారిటీ మెయితీలు నివసిస్తున్న ఇంఫాల్ లోయ ఉన్నది 11శాతమే. కాని ఆ రాష్ట్ర అభివృద్ధి నిధుల్లో 80 శాతం ఈ లోయకే చెందుతున్నాయి. మిగిలిన 20 శాతం మాత్రమే గిరి ప్రాంతాల్లో ఖర్చవుతున్నది. ఆ విధంగా మెయితీలు పాలకుల ఆదరాభిమానాలకు పాత్రులు అవుతున్నారు. కొండల్లోని తెగలు పాలకుల ఆదరానికి దూరంగా బతుకుతున్న దృశ్యం కనిపిస్తున్నది. 60 మంది సభ్యులున్న శాసనసభలో మెయితీలకు చెందిన మైదాన ప్రాంతం (ఇంఫాల్ లోయ) నుంచి 40 మంది ప్రాతినిధ్యం వహిస్తుండగా, గిరిజన వర్గాల నుంచి ప్రతినిధులు 20 మంది మాత్రమే. మెయితీలు అనుభవిస్తున్న అప్రతిహత ఆధిపత్యం గురించి ఇంతకు మించి వివరించనక్కరలేదు. పైపెచ్చు మెయితీలు హిందువులు. నాగాలు, కుకీలు క్రైస్తవులు. 2022లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో 32 మంది బలంతో బీజేపీ అధికారంలోకి వచ్చింది. వాస్తవానికి మణిపూర్‌లో పూర్వం నుంచి ఉంటున్నవారు మెయితీలు, నాగాలే. బ్రిటిష్ పాలనలో వచ్చి చేరిన కుకీ తెగవారు కొండల్లో చిన్న చిన్న గ్రామాలు ఏర్పాటు చేసుకొని బతకడం ప్రారంభించారు. ఆ దశలో నాగాలకు, కుకీలకు ఘర్షణలు జరిగాయి. కాని ఇప్పుడు కుకీల ఆందోళనకు నాగాలు మద్దతు ఇస్తున్నారు. నిధుల్లో, అధికారంలో గుత్తాధిపత్యం వహిస్తున్న మెయితీలకు ఎస్టీ గుర్తింపు లభిస్తే తమకు తీవ్ర నష్టం జరుగుతుందని, మజ్జిగ పలచబడి మరింత అన్యాయానికి గురి అవుతామనే అవగాహనతో, చైతన్యంతో కుకీల మాదిరిగానే నాగాలు కూడా భయపడుతున్నారు. సమష్టి ఆందోళనకు సహకరిస్తున్నారు.తాత్కాలిక దృష్టితో చూసినప్పుడు కుకీలను తీవ్రంగా ద్వేషిస్తూ వారిని తక్కువ చూపు చూస్తున్న బీజేపీ ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ ఈ సంక్షోభ విస్తరణకు తక్షణ బాధ్యుడని బోధపడుతున్నది. కుకీలు బయటి నుంచి వచ్చారని, గంజాయి సాగు చేస్తారని... ఇలా పలు రకాల ద్వేష భాషను ముఖ్యమంత్రి వారిపై ప్రయోగించారు. వాస్తవానికి మణిపూర్‌లోని అన్ని వర్గాలు గంజాయి సాగు చేస్తాయని, కానీ కుకీలను మాత్రమే వేలెత్తిచూపడం అలవాటుగా మారిందని అభిప్రాయం ఉన్నది. ముఖ్యమంత్రి బీరేన్ సింగ్‌ను తొలగించాలని




డిమాండ్ చేస్తూ 19మంది బీజేపీ శాసనసభ్యులు ప్రధాని మోదీకి ఇటీవలనే లేఖ రాశారు. అయినా కేంద్రంలో చలనం లేదు. ఇప్పుడు తాజా కల్లోల పరిస్థితుల నేపథ్యంలో బీరేన్ సింగ్ ప్రభుత్వానికి రెండు భాగస్వామ్య పక్షాలు మద్దతు ఉపసంహరించుకున్నాయి. 1948-49లో మణిపూర్ భారతదేశంలో విలీనం కాకముందు తాము ఎస్టీలమని ఆ హోదాను తమకు తిరిగి ఇవ్వాలని మెయితీలు వాదిస్తున్నారు. మణిపూర్ విలీనం తర్వాత తమకు ఆదివాసీ హోదా కొనసాగించక పోడానికి కారణం తాము మైదాన ప్రాంతీయులుగా సకల సౌకర్యాలు కలిగి ఉన్నందువల్లనే అనే వాస్తవాన్ని పూర్తిగా తెలిసి కూడా వారు ఎస్టీ హోదాను ఆశించడం తగనిది. గత మే 3వ తేదీ నాటికి అంటే కల్లోలం మొదలై ఏడాది ముగిసినప్పటికీ ఘర్షణల్లో 221 మంది మరణించగా ఈ సంఖ్య ఇప్పుడు 250కి మించినట్టు రూఢి అవుతున్నది. అన్నింటికీ మించి ఇంతగా భిన్న వర్గాల ప్రజల మధ్య ఘర్షణలు, మారణకాండ జరుగుతూ, అమాయకులు నిర్వాసితులు అవుతుంటే దేశ ప్రధానమంత్రి ఆ రాష్ట్రాన్ని సందర్శించకపోడం, పార్లమెంటులో దీని గురించి వివరంగా మాట్లాడకపోడం బాధితులకు పుండు మీద కారం చల్లినట్టు ఉంది. తమకు ప్రత్యేక పాలన వ్యవస్థను, శాసనసభను ఏర్పాటు చేయాలని కుకీలు కోరుతున్నారు.మణిపూర్‌లో ఇంకా వలస పాలనే కొనసాగుతున్నదని, భారత చరిత్ర పాఠ్య గ్రంథాలలో ఈశాన్యానికి తగిన ప్రాతినిధ్యం లేదని, అందుచేతనే ఆ ప్రాంత ప్రజలు బయటివారుగా పరిగణన పొందుతున్నారని, తమ సంక్షోభంపై కేంద్రం పాటిస్తున్న మౌనానికి ఇదే కారణమని మణిపూర్ ఎంపీ బిమల్ అకోయిజం పార్లమెంటులోనే ప్రకటించారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాల తీర్మానంపై గత జూలై మొదటివారంలో ఆ రోజు చిట్టచివరి వక్తగా ఆయనకు మాట్లాడే అవకాశం రాత్రి 11.45కి దక్కడాన్ని బట్టి మణిపూర్ సంక్షోభం పట్ల కేంద్రానికి గల నిర్లక్ష్యం రుజువు అవుతున్నది. పార్లమెంటు సంయుక్త సమావేశాలను ఉద్దేశిస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేసిన ప్రసంగంలో సుదీర్ఘ మణిపూర్ కల్లోలం ప్రసక్తి లేకపోడాన్ని కూడా బిమల్ అకోయిజం ఎత్తి చూపారు. మణిపూర్‌లో ఏడాదిన్నరకు పైగా అంతర్యుద్ధం సాగుతుండగా ప్రధాని నోరువిప్పి దానిపై ఒక్క మాట కూడా మాట్లాడటం లేదని, ఆయన తన మౌనవ్రతం వీడితే తాను మాట్లాడడం ఆపేస్తానని బిమల్ అన్నారు.మణిపూర్ ఏమైపోయినా ఫర్వాలేదు మెజారిటీ ఓటు తమవైపు ఉండాలి, హిందువుల వైపు నిలబడ్డామనే సంకేతాన్ని పంపాలి అని కేంద్రంలోని బీజేపీ 'ప్రభువులు' నిర్ణయించుకొన్నారని మనం భావించాలి. సమస్య అంతర్గతంగా భిన్న వర్గాల ప్రజల మధ్య హెచ్చు తగ్గుల ఘర్షణలకు చెందినది అయితే, దృష్టిని సరిహద్దు వైపు మళ్ళించి బయటినుంచి చొచ్చుకు వస్తున్నవారిని నిరోధించడమే పరిష్కారమనే అభిప్రాయాన్ని కలిగించడానికి హోం మంత్రి అమిత్ షా ప్రయత్నిస్తున్నారు. మయన్మార్‌తో గల 1500కి.మీ. సరిహద్దు పొడుగునా కంచె నిర్మించే ప్రణాళికను ప్రకటించారు. సరిహద్దులకు ఆవలి ఈవలి వారు స్వేచ్ఛగా గీత దాటడానికి అవకాశమిస్తూ గతంలో ఇండియా, మయన్మార్ల మధ్య కుదిరిన ఒప్పందాన్ని రద్దు చేసే ఉద్దేశాన్నీ వెలిబుచ్చారు. మణిపూర్‌కి భౌగోళికంగా విశేష ప్రాధాన్యముంది. మయన్మార్‌తో సరిహద్దులు ఆగ్నేయాసియాతో సంబంధాలకు ఇండియాకు ముఖద్వారం వంటివి. మయన్మార్‌తో చైనా సాన్నిహిత్యం పెరుగుతున్న నేపథ్యంలో దాని జోరుకు కళ్లెం వేయవలసి ఉంది. అందుకోసం మణిపూర్‌లో శాంతికి అమిత ప్రాధాన్యముంది. మయన్మార్‌తో సరిహద్దుల మూసివేత ఇందుకు విఘాతం కలిగించవచ్చు.ఒకటి రెండుసార్లు మణిపూర్‌కి చెందిన మెయితీ, కుకీ, నాగా ఎమ్మెల్యేలతో కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన చర్చలు ఫలించలేదు. ఆందోళన రెండు వర్గాల్లోని ప్రజానీకంలోకి, ముఖ్యంగా యువతలోకి చొచ్చుకుపోయింది. ఎమ్మెల్యేల పలుకుబడి అంతరించిపోయింది. ప్రజలు వారిని విశ్వసించడం మానేశారు. ఇప్పుడిక ఇది మీన 'మో%-%షా'లు లెక్కబెట్టే పరిస్థితి కాదు. బీరేన్ సింగ్ ప్రభుత్వాన్ని తక్షణం తొలగించాలి. తాత్కాలికంగానైనా రాష్ట్రపతి పాలన విధించాలి. బరువు బాధ్యతలు బలగాల మీద వదిలి ప్రధానమంత్రి విదేశీ పర్యటనలు చిత్తగించడం మేలు చేయదు. వీలయితే స్వయంగా అఖిలపక్షాన్ని తోడ్కొని మోదీ మణిపూర్‌ను సందర్శించాలి.

# మూడో ప్రపంచ యుద్ధం తప్పదా..?

న్యూఢిల్లీ, పలు దేశాల మధ్య నెలకొన్న వివాదాల నేపథ్యంలో యుద్ధ మేఘాలు బలంగా కమ్ముకున్నాయి. ఇప్పటికే /ఉకట్రయిన్ - రష్యా, ఇజ్రాయెల్- ఇరాన్ దేశాల మధ్య యుద్ధం కొనసాగుతున్నది. రెండు వైపులా ప్రాణ, ఆస్తి నష్టం విపరీతంగా జరిగింది. అయినా ఆయా దేశాలు వెనక్కి తగ్గడం లేదు. ఏ క్షణాన ఏ బాంబు వచ్చి తమపై పడుతుందోనని ఆయా దేశాల్లో సామాన్యులు భిక్కు భిక్కుమంటూ గడపాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రజల కష్టాలు మామూలుగా లేవు. పిల్లలు, పెద్దలు, మహిళలు ఇలా మరణాల రేటు విపరీతంగా ఉంది. యుద్ధోన్మాదం కారణంగా ఆయా దేశాల్లో ఆహార నిల్వలు భారీగా తగ్గిపోయాయి. ఇక అగ్రదేశాలు కూడా ఇరువర్గాల పక్షాన నిలబడ్డాయి. రష్యాలి- ఉక్రెయిన్ మధ్య యుద్ధం ప్రారంభమై ఇప్పటికే ఏడాది దాటింది. చిన్న దేశమైన ఉక్రెయిన్ ఏమాత్రం వెనక్కి తగ్గడం లేదు. తాజాగా అమెరికా అందించిన మిస్సైళ్లను రష్యా పై ప్రయోగించింది. దీంతో రష్యాకు కలుక్కుమంది. వెంటనే తమ అణు విధానాన్ని మార్చుకుంటున్నట్లు ప్రకటించింది. దీంతో అప్రమత్తమైన అమెరికా హెచ్చరికలు జారీ చేసింది. అమెరికా గనుక రంగంలోకి దిగితే ఇక నాటో దేశాల దళాలు కూడా ఈ యుద్ధంలో పాల్గొనే అవకాశం ఉంది. రష్యాకు గట్టి బుద్ధి చెప్పాలని అమెరికా కూడా భావిస్తున్నట్లు కనిపిస్తున్నది. ఇక హమాస్, ఇరాన్, ఇజ్రాయెల్ ల మధ్య ఉద్రిక్తతలు ఇప్పట్లో తగ్గేలా లేవు. ఇజ్రాయెల్ వరుస దాడులతో ఇరాన్ లో విధ్వంసం కొనసాగుతున్నది. ఇప్పటికే హమాస్ నేతలను మట్టుబెట్టిన ఇజ్రాయెల్ ఇక ఇరాన్ కు గట్టి బుద్ధి చెప్పాలని భావిస్తున్నది. ఇజ్రాయెల్ దళాల దూకుడుకు ఇరాన్ అడ్డుకట్ట వేయలేకపోతున్నదనే వార్తలు బయటకు వస్తున్నాయి. ఏ క్షణమైన ఈ యుద్ధం మరింత పెరిగే అవకాశమున్నట్లు తెలుస్తున్నది. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరుకోవడమే దీనికి కారణంగా కనిపిస్తున్నది.మరోవైపు ప్రపంచంలోని పలు దేశాల్లో పరిస్థితులు కూడా ఇలాగే ఉన్నాయి. ఇక ఇండియా విషయానికి వస్తే శత్రువు చుట్టు పక్కలా పాగా వేసేందుకు ప్రణాళిక లు వేస్తున్నాడు. ఇప్పటికే పలు మార్లు కవ్వింపు చర్యలకు దిగాడు. అటు పాకిస్థాన్‌తో కలిసి కుట్రలు చేస్తున్నట్టు సమాచారమందుతున్నది. అటు తైవాన్ పై దురాక్రమణకు సిద్ధమవుతున్నట్లుగానే చైనా దళాలు పలు చర్యలు చేపట్టారు. మిలటరీ ఆపరేషన్లు, వైమానిక కవాతులు ఇటీవల నిర్వహించారు. భారత్ చుట్టూ ఉన్న సముద్ర జలాలతో పాటు ఈశాన్య రాష్ట్రాలపై తమ అధిపత్యం కొనసాగాలని చైనా పాలకులు భావిస్తున్నారు.అందుకే సరిహద్దు వెంట కొన్ని కవ్వింపు చర్యలకు దిగుతున్నారు. ఇది ఇలాగే కొనసాగితే రానున్న రోజుల్లో భారత్. కు ప్రమాదం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఏదేమైనా ప్రపంచ వ్యాప్తంగా ప్రస్తుతం నెలకొన్న ఉద్రిక్త వాతావరణం ఎటు దారి తీస్తుందోననే ఉత్కంఠ నెలకొంది.

## మరో వారంలో డీఎస్సీ కొత్త సిలబస్ విడుదల

అమరావతి,నవంబర్21(ఆర్ఎన్ఎ): మెగా డీఎస్సీకి సంబంధించి మంత్రి నారా లోకేష్ కీలక ప్రకటన జారీ చేశారు. మరో వారం రోజుల్లో డీఎస్సీ కొత్త సిలబస్ జారీ చేస్తామని అన్నారు. ఈ మేరకు నోటిఫికేషన్ కంటే ముందుగానే సిలబస్ విడుదల చేయనున్నట్ల ఆయన తెలిపారు..మెగా డీఎస్సీపై కూటమి సర్కార్ రోజుకొక్క అప్‌డేట్ విడుదల చేస్తుంది. ఇప్పటికే విడుదలకావల్సిన డీఎస్సీ నోటిఫికేషన్ పలు కారణాల వల్ల వాయిదా పడిన సంగతి తెలిసిందే. అయితే తిరిగి ఎప్పుడు జారీ చేస్తారన్న దానిపై స్పష్టత కొరవడింది. ఎస్సీ వర్గీకరణపై నిపుణుల కమిటీ ప్రభుత్వానికి నివేదిక సమర్పిన తర్వాతే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల తేదీపై క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. డీఎస్సీ నోటిఫికేషన్ 2, 3 నెలలపాటు వాయిదా వేసినప్పటికీ అనుకున్న సమయానికి టీచర్ల భర్తీ చేస్తామని గట్టిగా చెబుతుంది.ఇదిలా ఉంటే ఇప్పటి వరకూ ఏపీ విద్యాశాఖ డీఎస్సీ సిలబస్‌కి సంబంధించి నిర్దిష్ట ప్రకటన జారీ చేయలేదు. పాత సిలబస్ ప్రకారంగానే డీఎస్సీ నిర్వహిస్తామని గతంలో చెప్పినప్పటికీ తాజాగా ఈ నిర్ణయంపై యూటర్న్ తీసుకుంది. డీఎస్సీ నిర్వహణకు కొంత సమయం పట్టే అవకాశం ఉన్నందున అభ్యర్థుల సన్నద్ధత కోసం ముందుగా సిలబస్‌ను విడుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మరో వారం రోజుల్లో డీఎస్సీ సిలబస్‌కు సంబంధించిన ప్రటకన విడుదల చేయనుంది. డీఎస్సీ నోటిఫికేషన్ కంటే ముందుగా సిలబస్‌ను విడుదల చేయాలని మంత్రి నారా లోకేశ్‌కు ఎమ్మెల్సీలు వేపాడ చిరంజీవిరావు, కంచర్ల శ్రీకాంత్, భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి వినతిపత్రం సమర్పించారు. దీనిపై స్పందించిన మంత్రి లోకేష్ ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు ఆన్‌లైన్ దరఖాస్తు గడువు నవంబర్ 20వ తేదీతో ముగిసింది. నవంబరు 19న రాత్రి 8 గంటల వరకు మొత్తం 2,48,174 దరఖాస్తులు అందాయని పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు, టెట్ ఛైర్మన్ ఈవీ నరసింహారెడ్డి తెలిపారు. పేపర్ 1కు 71,655, పేపర్ 2కు 1,55,971, రెండు పేపర్లకు కలిపి 20,546 దరఖాస్తులు వచ్చాయని ఆయన పేర్కొన్నారు. దరఖాస్తు వివరాల్లో పొరపాట్లు ఉంటే నవంబరు 22లోపు సవరించుకోవాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి తెలిపారు. తెలంగాణ టెట్ హాల్ టికెట్లు డిసెంబర్ 26న విడుదలవుతాయి. వచ్చే ఏడాది జనవరి 1 నుంచి జనవరి 20వ తేదీ వరకు టెట్ ఆన్‌లైన్ పరీక్షలు జరుగుతాయి. ఫిబ్రవరి 5వ తేదీన ఫలితాలను ప్రకటిస్తారు.

## కూటమికి ప్రమాదం ?

అమరావతి,ఇటీవల అసెంబ్లీలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ జాతీయ స్థాయి రోడ్లకు టెండర్లను పిలిచి నట్లుగానే ఏపీలోని రోడ్లకు కూడా టెండర్లు పిలిచి అవుట్ సోర్సింగ్ ఏజెన్సీలకు అప్పగించాలన్న తన ఆలోచనలు వివరించారు.ప్రభుత్వం దగ్గర ఉన్న సొమ్ముతో గుంతలు పూడ్చేందుకు 900 కోట్లను కేటాయించిందని ఆయన చెప్పారు. అయితే రానున్న రోజులలో రోడ్లు అందంగా మారాలన్నా పటిష్టంగా ఉండాలన్నా పూర్తి స్థాయిలో నిర్మాణం చేయాల్సిందే అని ఆయన చెప్పారు. ఈ విధంగా చేస్తే కనుక రోడ్లు అద్దాలుగా మారుతాయని దానితో పాటే అభివృద్ధి సాధ్యపడుతుందని ఆయన చెప్పుకొచ్చారు. దాంతో పాటు రోడ్లు రావాలీ అంటే టోల్ టాక్స్ వసూలు చేయాల్సిందే అని అన్నారుగ్రామాలు మండలాలను మినహాయించి పట్టణాలు నగరాలకు టోల్ టాక్స్ ని వర్తింపచేస్తామమి చెప్పారు. అలాగే బైకులు ట్రక్కులు ట్రాక్టర్లకు టోల్ టాక్స్ ఉండదని కూడా చెప్పారు. ఇవన్నీ చెబుతూనే ముందుగా ఈ ప్రయోగం గోదావరి జిల్లాల నుంచే మొదలెడదామని బాబు సూచించారు. అంతే కాదు ప్రజా ప్రతినిధులు అంతా ఈ విషయం మీద ప్రజలకు అవగాహన కల్పించి వివరించాలని కోరారుఅభివృద్ధి కావాలీ అంటే పబ్లిక్, ప్రయివేటు, ట్రాన్స్ ఫర్ పద్ధతిలో గ్రామీణ రోడ్లను నిర్మిస్తామని బాబు అంటున్నారు. ఈ విధానం కొత్త ఆలోచన అని సక్సెస్ అయితే డబ్బు అవసరం లేకుండా అభివృద్ధిని చూడవచ్చు అని కూడా అంటున్నారు.కానీ ఇది వికటించే ప్రమాదం ఉందని అంటున్నారు. ప్రజలు ఎటూ పన్నులు కడుతారు. దానినే సర్కార్ కి ఆదాయం రూపంలో ఖజానాలో చేరుతుంది. తాము కట్టిన పన్నులతో తమకు సదుపాయాలు కల్పించాలని ప్రజలు కోరుకుంటారు. కానీ ప్రభుత్వం మాత్రం మళ్లీ టోల్ టాక్స్ పేరుతో బాదుతామంటే ఎవరు ఊరుకుంటారు అన్న చర్చ సాగుతోంది.రాష్ట్రంలో మౌలిక సదుపాయాలు కల్పించడం ప్రభుత్వం బాధ్యతని అలాంటపుడు మధ్యలో ప్రజలు ఎందుకు వస్తారని అంటున్నారు.

# అటానమస్ కాలేజీల వెనక అక్రమ దందా

హైదరాబాద్, ఇటీవలి కాలం వరకు ఇంజనీరింగ్ కళాశాలకు యూజీసీ స్వయం ప్రతిపత్తి హోదా దక్కితే ఘనంగా చెప్పుకొనేవారు. అయితే, జేఎన్‌టీయూహెచ్ పరిధిలో ఇప్పుడా హోదాలేని కళాశాలలను వేళ్లపై లెక్కపెట్టొచ్చు. ప్రస్తుతం దాని పరిధిలో ఉన్న విద్యా సంస్థల్లోని 62 శాతం ఇంజినీరింగ్ కళాశాలలకు అటానమస్ హోదా ఉండటం గమనార్హం. అందులో సగం వరకు గత మూడేళ్ల కాలంలోనే సాధించాయి. వీటికి నో అ÷-జబెక్షన్ సర్టిఫికేట్ (ఎన్‌వోసీ)ను, తుది అనుమతి పత్రాల జారీ క్రతువులో రూ.కోట్లు చేతులు మారాయనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. ఈ వ్యవహారంపై దర్యాప్తు చేయించాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. స్వయం ప్రతిపత్తి కళాశాలలకు విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి డిమాండ్ ఉండటంతో కళాశాలలు గత మూడేళ్లలో స్వయంప్రతిపత్తి హోదా కోసం యూజీసీకి పెద్ద ఎత్తున్న దరఖాస్తులు చేసుకున్నాయి. కళాశాలల్ని అటానమస్‌గా ఎదిగేలా ప్రోత్సహించే లక్ష్యంతో యూజీసీ న్యాక్ గ్రేడ్, ఎన్‌బీఏ గుర్తింపు తదితర పలు అంశాలకు సంబంధించి పాయింట్లను తగ్గించింది. గతంలో అటానమస్ రావాలంటే న్యాక్ 'ఏ', ఆపై గ్రేడ్ ఉండాల్సి వచ్చేంది. దాన్ని యూజీసీ బీ గ్రేడ్‌కు కుదించడంతో ఇంజినీరింగ్ కళాశాలలు పోటాపోటీగా దరఖాస్తు చేసుకున్నాయి. ఈ డిమాండ్‌ను ఆసరాగా చేసుకుని... ఆ సమయంలో జేఎన్‌టీయూహెచ్‌లో అత్యున్నత హోదాలో ఉన్న ఒకరు సొమ్ము చేసుకున్నారన్న ఆరోపణలున్నాయి. ఎన్‌వోసీ, కన్ఫర్మెంట్ ఇచ్చేందుకు ఒక్కో కళాశాల నుంచి రూ.18 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు వసూలు చేసినట్లు సమాచారం. హైదరాబాద్ నగర శివారులోని ఓ కళాశాల సంబంధిత మొత్తాన్ని ముట్టజెప్పని కారణంగా... దాని బోర్డ్ ఆఫ్ స్టడీస్(బీవోఎస్) తదితర కమిటీల నియామక ప్రక్రియను నెలలపాటు పెండింగ్‌లో పెట్టినట్లు సమాచారం. ఈ విషయం గత ప్రభుత్వంలోని ఓ నేత దృష్టికి వెళ్లినా ఆయన సైతం ఏమీ చేయలేకపోయారని, దాంతో ఆ కళాశాల సంబంధిత మొత్తాన్ని ముట్టజెప్పినట్లు తెలిసింది. ప్రస్తుతం జేఎన్‌టీయూహెచ్ పరిధిలో 137 ఇంజినీరింగ్ కళాశాలలు ఉండగా... వాటిల్లో 85కిపైగా కళాశాలలకు యూజీసీ అటానమస్ హోదా ఉన్నవే. అందులో గత మూడేళ్లలో ఇచ్చినవే 40 వరకు ఉండటం గమనార్హం. పైకి చూస్తే అన్ని కళాశాలలకు న్యాక్ గ్రేడ్ ఉందని, నిబంధనల ప్రకారమే ఎన్‌వోసీ, కన్ఫర్మెంట్ ఇచ్చినట్లుగా కనిపిస్తుంది. కానీ, విద్యార్థులు నాసిరకం కళాశాలలుగా చెప్పుకొనే వాటికి సైతం అటానమస్ హోదా దక్కడం గమనార్హం. యూజీసీ మాత్రం కళాశాల యాజమాన్యం పంపిన వివరాలు, సంబంధిత వర్సిటీ ఎన్‌వోసీ ఆధారంగా అటానమస్ ఇస్తూ వస్తోంది. అటానమస్ అనుమతితోపాటు సీట్ల పెంపు, కొత్త సీట్లు తదితర అంశాలకు సంబంధించి ఇష్టారాజ్యంగా ఎన్‌వోసీలు ఇవ్వడాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోంది. వీటిపై విచారణ జరిపించాలని భావిస్తోంది. త్వరలోనే విచారణ కమిటీ వస్తుందని ఇటీవల జేఎన్‌టీయూహెచ్‌లో జరిగిన సమావేశంలో ఇన్‌ఛార్జి వీసీ, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం చెప్పినట్లు తెలిసింది. గతంలో కొన్ని కళాశాలలకు ఎన్‌వోసీలు మంజూరు చేయగా... ఇప్పుడు వాటిలోని ఆరేడు కళాశాలలకు తుది అనుమతి ఇవ్వడానికి ఆయన నిరాకరించినట్లు సమాచారం. నాసిరకం కాలేజీలకు స్వయంప్రతిపత్తి ఇస్తే నాణ్యత తగ్గిపోతుందని ఆయన భావిస్తున్నారు. మరోవైపు వచ్చే విద్యా సంవత్సరానికి(2025-26) కళాశాలలకు అనుమతులపై ఏఐసీటీఈ నోటిఫికేషన్ జారీ చేయడంతో అప్రమత్తమైన ప్రభుత్వం తమ ఆమోదం లేకుండా ఎన్‌వోసీలు జారీ చేయరాదని అన్ని వర్సిటీలకు తాజాగా ఆదేశాలు జారీ చేసింది. ఈ వర్సిటీ ఇచ్చే ఎన్‌వోసీలు, అనుమతులు, అనుబంధ గుర్తింపు తదితర అంశాలపై సీఎం కార్యాలయం స్వయంగా పర్యవేక్షిస్తుండటం గమనార్హం. పలు వివరాలను పంపాలని వర్సిటీ అధికారులను ఉరుకులు పరుగులు పెట్టిస్తున్నట్లు సమాచారం.

# ఏనుగులు పోతుంటే కుక్కలు మొరుగుతుంటాయి..

హైదరాబాద్,ఏనుగులు పోతుంటే కుక్కలు మొరుగుతూనే ఉంటాయి.. పట్టించుకోవాల్సిన అవసరం లేదని ప్రతి పక్షాలపై రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి హాట్ కామెంట్ చేశారు.ఖమ్మం జిల్లాలో రెండు రోజులపాటు హరీష్ రావు పర్యటన నేపథ్యంలో రేణుకా చౌదరి ఆగ్రహం వ్యక్తం చేశారు. నిన్నటి వరకు కుక్కిన పేనులా ఉన్న అజయ్ నేడు మీసాలు తిప్పుతున్నాడని అన్నారు. రైతులకు భేడీలు వేసిన వాళ్ళు ఇవ్వాళ మాట్లాడుతున్నారని తెలిపారు. దుష్టశక్తులు ఏవో మాట్లాడుతున్నారని అన్నారు. కార్తీక మాసంలో అపశకుణం మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఖరీఫ్ కు రబీకు తేడా తెలియని వారు మాట్లాడితే ఎలా? అని ప్రశ్నించారు.పోలీసులు లేకుండా జనాల్లోకి వచ్చినా మొహాలామీవి అని కీలక వ్యాఖ్యలు చేశారు. గుట్టలు మాయం చేసిన మీరా మాట్లాడేది అంటూ మండిపడ్డారు. కోయిన్ని వెంకన్నను అడిగితే మీ పాపాలు బయట పడతాయని సంచలన వ్యాఖ్యలు చేశారు. మీకు ప్రజల మీద సానుభూతి ఉంటే సలహాలు సూచనలు చేయండి. స్వీకరిస్తాం అన్నారు. రాష్ట్రం లో ఒక మాట దేశంలో ఒక మాట అంటూ మండిపడ్డారు. బిడ్డను జైల్ నుంచి విడిపించుకోవడానికి ఎన్ని ప్రయత్నాలు చేశారో దేశ ప్రజలకు తెలుసని కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో ప్రజలు చాలా హ్యాపీగా ఉన్నారన్నారు. రేవంత్ పాలన భేష్ అన్నారు. బీఆర్ఎస్ వాళ్లకు ఈర్ష్యా ద్వేషాలు పెరిగిపోయాయని తెలిపారు.ఇవాళ హరీష్ రావు పర్యటననే ఓ జోక్ అన్నారు. నాగలి పట్టి దున్నిన మొహలా మీవి అన్నారు. మీ బ్రతుకులు కమిషన్ కాకతీయ, కమిషన్ భగీరథ అని తెలిపారు. మీరు మంచి చేస్తే ఎందుకు ఓడిపోయారన్నారు. బీడీలు వేసిన చరిత్ర మీది కాదా? అని ప్రశ్నించారు. ప్రజలను నానా హింసలు పెట్టింది మీరే అని మండిపడ్డారు. ఓడిపోయి ఏమి చేయాలో తెలియక ఇలాంటి జోకులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిద్ర హారాలు మని రేవంత్ పని చేస్తున్నారని తెలిపారు. మీకు ఆత్మగౌరవం ఉందా? అని మండిపడ్డారు. మీకు రాష్ట్ర ప్రయోజనాల మీద కమిట్మెంట్ ఉందా అన్నారు. మీ రాజ్యసభ సభ్యులు ఏ స్కీం తెచ్చారన్నారు.పువ్వాడ అజయ్ కు ఏమీ కనబడవు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దమ్ముంటే నాతో రా%౩%.కలిసి నడుద్దాం అన్నారు. నేను తిరిగిన ఊళ్ళు నీవు తిరిగావా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ వాళ్ళు మోపిన భారాన్ని మీరు, మనం కట్టలిసినా పరిస్థితి అన్నారు. నెల కాగానే జీతాలు ఇస్తున్నామన్నారు. నకిలీ విత్తనాలతో సుజాతనగర్ లో రైతులు ఇబ్బందులు పడితే రైతుకు 6500 ఇప్పించానని తెలిపారు. నకిలీ విత్తనాలు అమ్మే వ్యాపారులను రాష్ట్ర బహిష్కరణ చేయాలన్నారు. కొత్తగూడెంలో ఫ్రీ కండిషన్ ఎయిర్ పోర్ట్ రానుందన్నారు. ఆ రోజుల్లోనే కార్గో ఫ్లెయిన్ కూడా అడిగా అని గుర్తు చేశారు. ఖమ్మం జిల్లాలో అడవి అనేది లేకుండా పోయిందన్నారు. వైరాలో రైతులకు పంటల పై అవగాహన కోసం హాస్టల్ కట్టించాలని అనుకున్నామన్నారు. కొత్తగూడెం రైల్వే భూములను మనం తీసుకొని వాళ్లకు వేరే భూమి ఇవ్వాలని నిర్ణయించామన్నారు.ఖమ్మంను మర్చిపోనే పోను..నేను ఖమ్మం జిల్లా ఆడబిడ్డను.ఆ బిరుదు అది శాసిత్వం అన్నారు. వచ్చే ఏడాది స్తంభాద్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించబోతున్నామని తెలిపారు. మత్స్యకారుల పండుగ రోజున పాలేరులో ఉత్సవాలు జరుపబోతున్నాం అన్నారు.

# పరిసరాల పరిశుభ్రతే ధ్యేయం !

చింతూరు, ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు అల్లూరి సీతారామరాజు జిల్లా యంత్రాంగం, చింతూరు ఐటీడీఏ అధికారులు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. చింతూరు ఐటీడీఏ నూతన పీవో, యువ ఐఏఎస్ అధికారి అపూర్వ భరత్ తనదైన శైలీలో ముద్రను వేసేందుకు ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమానికి శ్రీకారం పలికారు. చింతూరు ఐటీడీఏ పరిధిలోని నాలుగు మండల కేంద్రాలతో పాటు, ఇతర ప్రాంతాలు, గ్రామాల్లో నెలకొన్న అధ్వాన్నపు పారిశుధ్య పరిస్థితులను మెరుగు పరచటంతో పాటు, సీజనల్ వ్యాధులను కట్టడి చేసేందుకు దానికి అనుగుణంగా తీసుకోవాల్సిన అత్యవసర చర్యలను పాటించేందుకు ప్రతి శుక్రవారం స్పెషల్ డ్రైవ్స్ నిర్వహించటానికి ఐటీడీఏ పీవో సిద్దమయ్యారు. ఈ వినూత్న కార్యక్రమానికి ఐటీడీఏ పీవో 'ఫ్రైడే డ్రైడే' కార్యక్రమంతో నాంది పలికారు.



ప్రధాన ఆంశాలను పరిగణలోకి తీసుకొని

ఫ్రైడే డ్రైడేలో భాగంగా ప్రజారోగ్యాన్ని దెబ్బతీసే వాటిలో ప్రధాన ఆంశాలను పరిగణలోకి తీసుకొని అపరిశుభ్రత అంశంతో పాటు, నూరు శాతం శానిటేషన్, వ్యర్థ పదార్థాల నిర్వహణ, దోమల నిర్మూలన, రక్షిత మంచినీటికి ప్రత్యేక ప్రాధాన్యత కల్పించాలనే సంకల్పంతో చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్ ఈ కార్యక్రమానికి పిలుపునిచ్చారు. మండల కేంద్రాలు, పంచాయతీలు, గ్రామాలు, కుగ్రామాలు ఎదుర్కొంటున్న ప్రధానమైన సమస్యల్లో పారిశుధ్యం ఒకటని భావించి పారిశుధ్య సమస్యల్లో ఎక్కడ పడితే అక్కడ రోడ్ల వెంబడి చెత్త పోగులు దర్శనమిస్తున్నాయని, డంపింగ్ యార్డులు లేకపోవటం వల్ల వ్యర్థపదార్థాల నిర్వహణ సరిగా ఉండటం లేదని గమనించి ఈ సమస్యకు శాశ్వతంగా చెక్ పెట్టడానికి విధానపరమైన నిర్ణయాలు తీసుకుంటున్నారు.

పరిసరాలను శుభ్రపరుస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తూ

ఈ డ్రైడే కార్యక్రమంలో భాగంగా ఐటీడీఏ పీవో గత నాలుగు వారాల నుండి క్రమం తప్పకుండా ప్రతి శుక్రవారం పరిసరాలను శుభ్రపరుస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తూ ముందుకు సాగుతున్నారు. ఈ పారిశుద్య కార్యక్రమంలో ఐటీడీఏ పీవో సైతం పాల్గొని చీపురు పట్టుకొని రహదారులను శుభ్రంచేసి పారిశుద్ధ్య కార్మికుల్లో ఉత్సాహాన్ని నింపుతున్నారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో మాత్రం రోడ్ల వెంబడి చెత్త పోగులను తొలగిస్తున్నారు. వ్యర్థాలు ఎక్కడ పడితే అక్కడ పారవేయకుండా చర్యలు చేపడుతున్నారు. ఆ మేరకు ప్రజల్లో అవగాహన పెంపొందించే కార్యక్రమాలు కూడా చేపడుతున్నారు.

పర్యాటక ప్రాంతంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం

చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్ ఒక అడుగు ముందుకు వేసి కేవలం పరిసరాలను మాత్రమే కాదు పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి మీద ఉందని చెపుతూ చింతూరు మన్యంలోని పర్యాటక ప్రాంతంలో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా మండలంలోని చింతూరు- మారేడుమిల్లి ఘాట్ రహదారి వెంబడి, తులసిపాక గ్రామ శివారు ప్రాంతంలో పేరొందిన సోకిలేరు వ్యూ పాయింట్ వద్ద పీవో చెత్త చెదారాన్ని తొలగించడంతో పాటు ఫ్లాస్టిక్ సీసాలను, ఫ్లాస్టిక్ కవర్లను తన స్వహస్తాలతో తీసి శుభ్రం చేశారు.

పీవో స్పూర్తితో ఇతర శాఖల్లో కదలికలు

చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్ ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్ని గత నెల రోజులుగా నిర్వహిస్తుండటంతో ఆయన స్పూర్తితో ఇతర ప్రభుత్వ శాఖల అధికారుల్లో సైతం కదలికలు వచ్చాయి. పీవోని ఆదర్శంగా తీసుకొని ఆయా శాఖల అధికారులు తమ కార్యాలయాల చుట్టూ ఉన్న చెత్త చెదారాన్ని తొలిగించి పరిసరాలను శుభ్రం చేస్తున్నారు. అధికారులు పరిసరాలను శుభ్రం చేయడంతో రహదారుల వెంబడి చెత్తను తొలగించడంతో ప్రజల్లో సైతం మార్పు మొదలై తమ గృహాల చుట్టూ చెత్తను తొలిగించుకునే పనిలో నిమగ్నమవుతున్నారు. ఏది ఏమైనప్పటికీ ఈ యువ ఐఏఎస్ చేపట్టిన ఈ కార్యక్రమంతో పరిసరాలు పరిశుభ్రంగా మారుతున్నాయి.

# ఎంబీబీఎస్ డాక్టర్లుగా చలామణీ అవుతున్న ఆర్‌ఎంపీ,పీఎంపీలు




కరీంనగర్, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నకిలీ డాక్టర్ల వ్యవహారం కలవరపెడుతోంది. కేవలం ఫస్ట్ ఎయిడ్‌కే పరిమితం కావాల్సిన ఆర్‌ఎంపీలు, పీఎంపీలు.. ట్రీట్‌మెంట్ చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. అర్హతలు లేకపోయినా 5 నుంచి 10 బెడ్లతో క్లినిక్స్, నర్సింగ్ హోమ్‌లు నిర్వహిస్తున్నారు. ప్రిస్క్రిప్షన్లు రాయడం, యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్స్ ఇస్తూ వచ్చీరాని వైద్యం చేసి ప్రజల ప్రాణాల మీదికి తెస్తున్నారు. ఈ క్రమంలో తెలంగాణ మెడికల్ కౌన్సిల్(టీజీఎంసీ) గత ఆర్నెళ్లుగా వరుస దాడులు నిర్వహిస్తోంది. ఈ ఏడాది జూన్‌లో నిర్వహించిన దాడుల్లో రాష్ట్రంలో 40 మందిని గుర్తించి కేసులు నమోదు చేయగా.. వారిలో కరీంనగర్ జిల్లాకు చెందినవారే ఏడుగురు ఉన్నారు. మూడు రోజుల కింద కరీంనగర్ మంచిర్యాల చౌరస్తా సమీపంలో ఎలాంటి అనుమతుల్లేకుండా ఒక ఆర్‌ఎంపీ 'శ్రీసాయి సాహిత్' పేరిట హాస్పిటల్ నిర్వహిస్తూ టీజీఎంసీ బృందానికి చిక్కాడు.

ఉమ్మడి జిల్లాలో టీజీఎంసీ టీం దాడులు..

కరీంనగర్‌లో అర్హత లేకుండా నిర్వహిస్తున్న మూడు క్లినిక్‌లపై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ (టీజీఎంసీ) అధికారులు జులైలో దాడులు నిర్వహించారు. క్లినిక్‌లలో ప్రిస్క్రిప్షన్లు రాయడం, యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్స్ ఇవ్వడంతోపాటు క్లినిక్‌లలో ఇన్‌పేషెంట్లను చేర్చుకుంటున్నారు. గతంలో కరీంనగర్ పట్టణంలోని వెంకటేశ్వర క్లినిక్, లక్ష్మీ క్లినిక్, లలిత పాలిక్లినిక్‌లపై దాడులు నిర్వహించి సీజ్ చేశారు. గోదావరిఖనిలో నిర్వహించిన టీజీఎంసీ తనిఖీల్లో శ్రీనివాస క్లినిక్ పేరుతో అర్హత లేకుండా అల్లోపతి వైద్యం చేస్తున్నట్లు గుర్తించారు. శివ అనే వ్యక్తి 'శివ పైల్స్ క్లినిక్' పేరిట నిర్వహిస్తున్న హాస్పిటల్‌ను గుర్తించారు. వీటిల్లో విచ్చలవిడిగా యాంటిబయోటిక్స్, ఫైరోయిడ్స్ ఇస్తున్నట్టు ఆధారాలు సేకరించారు. ఎన్ఎంసీ చట్టం 34,54 ప్రకారం వీరిపై కేసు నమోదు చేశారు. ఆగస్టులో పెద్దపల్లి జిల్లాలోని పెద్దపల్లి, సుల్తానాబాద్ లో నకిలీ అల్లోపతి డాక్టర్ల క్లినిక్స్ పై తనిఖీలు నిర్వహించింది. ఈ తనిఖీల్లో పెద్దపల్లిలోని లోటస్ హాస్పిటల్, ఇమ్రాన్ బోన్ సెట్టింగ్స్ సెంటర్, వైఎస్ అజీజ్ క్లినిక్, సుల్తానాబాద్ లోని నీలకంఠేశ్వర్ మెడికల్ షాప్ పేరిట ఎలాంటి అర్హత లేకుండా కొందరు వైద్యం చేస్తునట్లు టీజీఎంసీ టీం గుర్తించారు.

నిబంధనలు ఏం చెప్తున్నాయ్.


నేషనల్ మెడికల్ కమిషన్ యాక్ట్ - 2019, తెలంగాణ మెడికల్ కౌన్సిల్ రూల్స్ 2013, టీఎంపీఆర్ యాక్ట్ 1968 ప్రకారం అర్హత లేకుండా క్లినిక్‌లు నిర్వహిస్తున్న వారిపై సంబంధిత పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు చేయాలని తెలంగాణ మెడికల్ కౌన్సిల్ స్పష్టం చేస్తోంది. ఎన్ఎంసీ 2019లోని సెక్షన్ 34 రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషినర్ కాకుండా మరెవ్వరూ మెడిసిన్ ప్రాక్టీస్ చేయడం నిషేధం. ఈ నిబంధనలను ఉల్లంఘించేవారికి ఏడాది వరకు జైలు శిక్ష లేదా రూ.5 లక్షల వరకు జరిమానా లేదా రెండింటిని విధించాలని చట్టం చెప్తోంది.'శంకరపట్నం మండలం మెట్‌పల్లి గ్రామానికి చెందిన ముంజ లక్ష్మయ్య(42)కు వ్యవసాయ పనులకు వెళ్లగా వాంతులు, విరేచనాలయ్యాయి. దీంతో స్థానిక ఆర్ ఎంపీ ధవరావు అలియాస్ మధు వద్దకు వెళ్లగా ఆయనకు 2 ఇంజక్షన్లు వేసి పంపించాడు. మరుసటి రోజు మరో రెండు యాంటీబయాటిక్ ఇంజక్షన్లు వేసి రెండు సెలైన్ బాటిల్ ఎక్కించడంతో చలికి లక్ష్మయ్య వణికిపోయాడు. ఇంటికి వెళ్లిన ఆయన పాలు తాగి గిలగిలా కొట్టుకోవడంతో కుటుంబ సభ్యులు మళ్లీ ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లారు. చేతులెత్తిసినా ఆయన హనుమకొండకు తీసుకెళ్లాలని సూచించాడు. అక్కడ చికిత్స పొందుతూ చనిపోయాడు.'

నకిలీ డాక్టర్లపై చర్యలు తీసుకోవాలి

కరీంనగర్ సిటీలో ఎలాంటి అనుమతులు లేకుండా ఆర్ఎంపీలు నర్సింగ్ హోంలు నిర్వహిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణం. ఎలాంటి విద్యార్హత లేకున్నా అత్యాధునిక వైద్యం పేరిట ప్రజలను దోపిడి గురి చేస్తున్న నకిలీ డాక్టర్లపై చర్యలు తీసుకోవాలి. కరీంనగర్ లో సాహితి హాస్పిటల్‌లో వైద్యం చేస్తున్న నకిలీ డాక్టర్‌పై నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేయాలి. - బి.యుగంధర్, ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి

# మోదీ, అమిత్ షాపై ఆరోపణలతో కవ్వింపు చర్యలు.. వెనక్కి తగ్గిన కెనడా

న్యూఢిల్లీ,ఖలీస్థానీ ఉగ్రవాది హర్దీప్‌సింగ్ నిజ్జర్ హత్య కేసులో భారత్‌పై కెనడా కవ్వింపు చర్యలకు పాల్పడుతూనే ఉంది. ఈ హత్య వెనక భారత ప్రభుత్వ ఏజెంట్ల హస్తం ఉందంటూ కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో గతేడాది చేసిన వ్యాఖ్యలతో ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలు దెబ్బతిన్నాయి. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా సిక్కు వేర్పాటువాదీ హత్య వెనుక భారత ప్రధాని మోదీతోపాటు అమిత్ షా, విదేశాంగమంత్రి, పలువురు ప్రముఖుల హస్తం ఉందంటూ కెనడాకు చెందిన భద్రతా సంస్థలు ఆరోపించాయని ఆ దేశ దినపత్రిక 'ది గ్లోబ్ అండ్ మెయిల్' ఒక వార్తా కథనాన్ని ప్రచురించడం సంచలనంగా మారింది.. కెనడాలో నివసిస్తున్న మరికొందరు వేర్పాటువాదులను కూడా నిర్మూలించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్టు పేర్కొంది.అయితే ఆ ఆరోపణలను భారత్ తోసిపుచ్చింది. కెనడా అర్థంలేని ఆరోపణలు చేస్తుందని, ఇటువంటి హాస్యాస్పదమైన వార్తలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపింది. దీంతో కెనడా తాజాగా వెనక్కి తగ్గింది. ఆ కథనాలు ఊహజనితమైనవని, అవాస్తవమని తెలిపింది. ఈ మేరకు జస్టిన్ ట్రూడో జాతీయ భద్రత, ఇంటెలిజెన్స్ సలహాదారు నథాలీ జి డ్రౌయిన్ ఓ ప్రకటన విడుదల చేశారు.'ప్రజల భద్రతకు ముప్పు పొంచి ఉన్న వేళ అక్టోబరు 14న రాయల్ కెనడియన్ మౌంటెడ్ పోలీసులు, అధికారులు అసాధారణ చర్య చేపట్టారు. భారత ప్రభుత్వానికి చెందిన ఏజెంట్లు కెనడా గడ్డపై పాల్పడుతున్న నేర కార్యకలాపాలకు సంబంధించి బహిరంగ ప్రకటనలు చేశారు. ఈ నేర కార్యకలాపాలకు భారత ప్రధాని మోదీ, ఆ దేశ విదేశాంగ మంత్రి జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌తో సంబంధం ఉన్నట్లు కెనడా ప్రభుత్వం ఎన్నడూ పేర్కొనలేదు. దీని సాక్ష్యాధారాల గురించి కూడా తెలియదు.



దీనికి భిన్నంగా ఎలాంటి కథనాలు ప్రచురితమైనా అవన్నీ ఊహాజనితం.. అవాస్తవమైనవే" అని కెనడా సర్కారు తమ ప్రకటనలో వెల్లడించారు.కాగా నిజ్జర్ హత్యగురించికెనడా 'ది గ్లోబ్ అండ్ మెయిల్' వార్తాపత్రికలో ఇటీవల ఓ కథనం ప్రచురితమైంది. నిజ్జర్ హత్యకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా కుట్ర పన్నారని, ఈ విషయాన్ని మోదీతోపాటు విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌కు సమాచారం ఇచ్చారని కెనడా జాతీయ భద్రతా అధికారి ఒకరు చెప్పినట్లు ఆ కథనం పేర్కొంది. దీనిపై భారత్ తీవ్రంగా మండిపడింది. అవన్నీ హాస్యాస్పద వార్తలనేనని ఖండించింది. ఇలాంటి దుష్ప్రచారాలు ఇప్పటికే దెబ్బతిన్న రెండు దేశాల మధ్య సంబంధాలను మరింత దిగజారుస్తాయని విదేశాంగ శాఖ ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ గురువారం పేర్కొన్నారు. . ఈ క్రమంలోనే కెనడా తాజాగా ప్రకటన విడుదల చేయడం గమనార్హం.

# సమర్థంగా కేంద్రప్రభుత్వ పథకాల వినియోగం

నల్లగొండ, కేంద్ర ప్రభుత్వ పథకాల నిధులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సూచించారు. నల్లగొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన కేంద్ర విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశానికి స్థానిక ఎంపీ రఘువీర్ రెడ్డి అధ్యక్షత వహించగా, జిల్లా ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ పథకాలను రాష్ట్రంలో అమలు చేయడం ద్వారా పేదరిక నిర్మూలన, ఉపాధి అవకాశాల పెంపు, గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి లక్ష్యాలను సాధించవచ్చని తెలిపారు. కేంద్ర పథకాల అమలుకు సంబంధించి తన ఎంపీ అనుభవాలను సభ్యులతో పంచుకుంటూ, వాటిని ఎఫెక్టివ్‌గా అమలు చేయడంపై దృష్టి సారించాలని సూచించారు.కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ప్రతీ జిల్లాలో దిశ కమిటీలను ఏర్పాటు చేసి, అభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణకు అవసరమైన సమన్వయం అందిస్తోందని మంత్రి తెలిపారు. తుమ్మల నాగేశ్వర్ రావుతో కలిసి నల్లగొండ జిల్లాలో అమలవుతున్న పథకాలపై సమీక్ష నిర్వహించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యేలు నేనావత్ బాలు నాయక్, వేముల వీరేశం, మందుల సామేల్, బత్తుల లక్ష్మారెడ్డి, కుందూరు జయవీర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కాలాష్టమి రోజు..కాలభైరవ పూజ

వేములవాడ,శివుని ఉగ్ర రూపమైన కాల భైరవుడి జన్మదినాన్ని ప్రతి సంవత్సరం కార్తీక మాసంలోని శుక్ల పక్ష అష్టమి తిథిన జరుపుకుంటారు. ఈ రోజున కాలభైరవుడిని పూజించిన వ్యక్తి అన్ని కష్టాల నుంచి అకాల మరణ భయం నుంచి విముక్తి పొందుతాడని నమ్మకం. శక్తిసంపన్నుడైన కాలభైరవుడు ఉద్భవించిన రోజుని కాలభైరవ అష్టమిగా జరుపుకుంటూ వుంటారు. కాలభైరవ ఆలయాల్లో స్వామికి అభిషేకాలు నిర్వహిస్తారు. లేదంటే శివాలయాల్లోనే పూజాభిషేకాలు జరుపుతారు.ఈ ఏడాది నవంబరు 23వ తేదీ శనివారం కాలాష్టమి అంటే కాల భైరవుడి జన్మదినోత్సవం జరుపుకోనున్నారు. పురాణ గ్రంథాలలో కాల భైరవుడు అపరిమిత శక్తుల దేవుడిగా పరిగణింపబడ్డాడు. శివుని ఈ అవతారం మూలానికి సంబంధించిన కథ ఒకటి శివ పురాణంలో ఉంది. శివ పురాణంలోని శ్రీ శత్రుద్ర సంహిత ఎనిమిదవ అధ్యాయం భైరవ అవతారంలో కాల భైరవుని జనన మూలం వివరించబడింది. శివ పురాణం ప్రకారం ఒకప్పుడు బ్రహ్మ దేవుడు సుమేరు పర్వతంపై కూర్చుని ధ్యానం చేస్తున్నాడు. అప్పుడు దేవతలు అతని వద్దకు వచ్చి ముకుళిత హస్తాలతో స్వాగతం పలికారు. ఆ తర్వాత ఈ ప్రపంచంలో నశించని అంశం ఏమిటి అని అడగడం మొదలుపెట్టాడు. నా కంటే గొప్పవాడు లేడని బ్రహ్మ చెప్పాడు. తన నుంచే ప్రపంచం పుట్టింది. తన వల్లనే ప్రపంచం మొదలవుతుంది.. అంతమవుతుంది. బ్రహ్మ తన గురించి చెప్పిన మాటలు విని అక్కడ ఉన్న శ్రీ మహా విష్ణువు చాలా బాధపడ్డాడు. అప్పుడు విష్ణువు.. బ్రహ్మతో మాట్లాడుతూ నా ఆజ్ఞ ప్రకారం మీరు విశ్వ సృష్టికర్త కనుక మిమ్మల్ని మీరు పొగుడుకోవద్దు. ఆ తర్వాత ఇద్దరూ తాను గొప్ప అంటే తాను గొప్ప అంటూ వాదుకోవడం మొదలు పెట్టారు. తామే గొప్పవారమని నిరూపించుకోవడానికి వేదాలు పఠించారు. క్రమక్రమంగా వారి వివాదం పెరిగిందట. ఆ తర్వాత అతను నాలుగు వేదాలను వాటి ఔన్నత్యాన్ని గురించి అడిగాయి. అప్పుడు ఋగ్వేదం శివుడిని స్మరిస్తూ ఓ బ్రహ్మనా! హే శ్రీ హరీ! భూమి అంతా ఎవరిలో నివసిస్తుందో అతడే శివుడు. అప్పుడు యజుర్వేదం శివుని అనుగ్రహం వల్లనే వేదాల ప్రామాణికత రుజువవుతుందని చెప్పింది. ఆ తర్వాత సామ వేదం మాట్లాడుతూ సమస్త లోక ప్రజలను తప్పుదోవ పట్టించే వాడు.. అతని తేజస్సుతో ప్రపంచం మొత్తాన్ని వెలుగులోకి తెస్తుంది. ఆయనే త్రయంబకుడు శివుడు. వేదాలు చెప్పినది విన్న తర్వాత బ్రహ్మ ఇలా అన్నాడు: 'ఓ వేదలారా మీ మాటలు మీ అజ్ఞానాన్ని ప్రతిబింబిస్తాయి. శివుడు ఎప్పుడూ తన శరీరంపై భస్మాన్ని ధరిస్తాడు. తలపై శిగ, మెడలో రుద్రాక్షలు, పాములను ధరిస్తాడు. శివుడిని అత్యున్నత మూలకం అని ఎలా పిలుస్తారు? ఆయనను పరమ బ్రహ్మగా ఎలా పరిగణిస్తారు? ప్రశ్నించాడు. బ్రహ్మ చెప్పిన మాటలు విన్న శ్రీ హరివిష్ణువు సాకారమైన, నిరాకారమైన రూపంలో ప్రతిచోటా ఉన్న ఓంకార స్వరూపుడు.. శివుడు శక్తితో కూడినవాడు అని చెప్పాడు. అతను గొప్ప లీలాధారి. ఈ ప్రపంచంలో ప్రతిదీ శివుడి అనుమతి ద్వారానే జరుగుతుంది. అయితే దీని తరువాత కూడా బ్రహ్మ, విష్ణువు మధ్య వివాదం ముగియలేదు. పోట్లాట సాగుతూనే ఉంది.బ్రహ్మ, విష్ణువు మధ్య వివాదం ఎప్పటికీ ముగియలేదు. అప్పుడు వారి మధ్య నుంచి ఒక పెద్ద కాంతి కనిపించింది. శివుడు ఆది అంతం లేని అగ్ని స్తంభం రూపంలో బ్రహ్మ, విష్ణువుల మధ్య కనిపించాడట. ఈ స్తంభం ఆది అంతాలను కనుగొనమని బ్రహ్మ, విష్ణువుకి శివుడు సూచించాడట. ఎంత ప్రయత్నించినా ఇద్దరూ ఆది అంతాన్ని కనుక్కోలేకపోయారట. బ్రహ్మ దేవుడు ఐదవ ముఖం శివుడిని తూలనాడడం ప్రారంభించాడు. దీనితో కోపోద్రిక్తుడైన శివుడు హూంకరించాడు. ఆ హూంకారం నుంచి ఒక భయంకర రూపం ఆవిర్భవించింది. ఆ భయంకర రూపమే కాలభైరవుడు. శివుడి ఆజ్ఞ మేరకు శివుడిని దూషించిన బ్రహ్మదేవుడి ఐదవ శిరస్సుని కాలభైరవుడు ఖండించాడు. అప్పుడు బ్రహ్మదేవుడి గర్వం అణిగిపోయింది.దీంతో కాల భైరవుడుకి బ్రహ్మ హత్యా దోషం చుట్టుకుంది. అప్పుడు శివుడు అన్ని తీర్థ స్థలాలను సందర్శించమని కాలభైరవుడికి సూచించాడు. భూమిపై ఉన్న అన్ని పుణ్యక్షేత్రాలను సందర్శించిన తరువాత కాలభైరవుడు కాశీకి చేరుకున్నాడు. కాల భైరవుడి చేతికున్న బ్రహ్మ కపాలం మాయమైంది.

# చెత్తపన్ను రద్దుకు ఆమోదం

అమరావతి,పట్టణ ప్రాంతాల్లో చెత్తపన్ను రద్దుకు శాసనసభ ఆమోదం తెలిపింది. మున్సిపల్‌శాఖ మంత్రి పి నారాయణ బిల్లు ప్రవేశపెట్టగా స్వల్ప చర్చతో సభ ఆమోదించింది. దీంతో సర్వత్రా హర్ష వ్యక్తం అవుతోంది. గతంలో వైఎస్ జగన్ హయాంలో చెత్తపన్ను వేయగా, రాష్ట్రంలో నిరసనలు పెల్లుబికాయి. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో చెత్తపన్ను వసూలు, కాంట్రాక్టుల్లో జరిగిన అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు. టిడిపి హయాంలో మున్సిపాలిటీల్లో ఒక్క రూపాయి కూడా ట్యాక్స్ పెంచలేదని అన్నారు. ఇంటి పన్ను రూ.50 వున్న పేద వారి నుంచి చెత్తపన్ను ఏడాదికి రూ.360 వసూలు చేశారని ఎద్దేవా చేశారు. చెత్త తొలగింపు కాంట్రాక్టర్లకు సొమ్ము చెల్లించేందుకు వీలుగా ఈ పన్ను వసూలు చేశామని గత పాలకులు చెప్పారన్నారు. 2014-19 మధ్య టిడిపి అధికారంలో ఉన్న సమయంలో మున్సిపాలిటీల్లో ఒక్క రూపాయి కూడా ట్యాక్స్ పెంచలేదని తెలిపారు. కానీ వైసిపి చెత్తపన్నుతోపాటు ఆస్తి పన్ను పెంచిందన్నారు.

# పట్టీలు కొట్టిన కారు వాళ్ళు తిరిగి రారు




హైదరాబాద్,పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ పై హైకోర్టులో అందరూ ఊహించిన తీర్పే వచ్చింది. సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకోండి అంటూ స్పీకర్ కు సూచించింది హైకోర్టు. ఒకటి న్యాయవ్యవస్థ, ఇంకొకటి శాసన వ్యవస్థ. వేటికవే స్వతంత్రత ఉంది. ఎవరైనా సరే చట్టప్రకారం నడుచుకోవాలి. పదో షెడ్యూల్ ప్రకారం అనర్హత పిటిషన్లపై స్పీకర్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. దానికి ఇంత సమయం అంటూ ఏదీ లేదు. అందరినీ విచారించి, వివరణ తీసుకుని చేయాల్సి ఉంటుంది. కానీ గులాబీల తీరు ఎలా ఉందంటే అన్నీ రాత్రికి రాత్రే అయిపోవాలి. పార్టీ మారిన వారిపై వేటు పడాలి. తాము ఖుషీ అవ్వాలి. ఇదే లెక్క. కానీ నడుస్తుందా? గతంలో గుర్తుకు రాని అన్యాయం ఇప్పుడే గుర్తొచ్చిందా?

గులాబీ బాపు జాతకం అంతా రివర్స్ అవుతోందా?

అదేంటోగానీ గులాబీ బాపు జాతకం అస్సలు బాగున్నట్లు కనిపించడం లేదు. ఒకప్పుడు పట్టిందల్లా బంగారం అన్నట్లు ఉండేది. గురు మహర్దశ నడిచింది. కానీ ఇప్పుడు కాదు. నాడు అధికారం ఉన్నప్పుడు ఎమ్మెల్యేల చేరికల గురించి సారు దంచిన డైలాగ్స్ చూశారు కదా. ఏరు దాటక ముందు ఒకటి, ఏరు దాటాక ఇంకొకటి. మీకే ఆకర్షణ ఉంటే ఎలా వస్తారండీ.. అన్నారు. మరిప్పుడు ఏమైంది మీ ఆకర్షణ? ఎమ్మెల్యేలు ఎందుకు చేజారుతున్నారు? కొంచమైనా అర్థమవుతోందా? మీకు మీరు కంట్రోల్ చేసుకోవాలన్నారు.. ఇతరులపై ఏడ్వడం కరెక్ట్ కాదన్నారు. మరిప్పుడు మీ ఎమ్మెల్యేలు పార్టీ మారితే.. తమరు చేస్తున్నదేంటి సారూ.. అన్న ప్రశ్నలు కాంగ్రెస్ వైపు నుంచి వస్తున్నాయి.

కారెక్కితే కరెక్టు.. ఇప్పుడు దిగితే తప్పా?

అప్పుడు ఇతర పార్టీల నుంచి ఎమ్మెల్యేలు కారెక్కితే కరెక్టు.. ఇప్పుడు కారు దిగి అధికార కాంగ్రెస్ లోకి వెళ్తే మాత్రం రాంగ్. ఇదెక్కడి దిక్కుమాలిన లాజిక్ భయ్యా? అని కడిగిపారేసే వారు ఎక్కువయ్యారు. అంతే కాదు ఎమ్మెల్యేలు పార్టీ మారినంత మాత్రాన అదో భయంకరమైన తప్పు జరిగినట్లు, అన్యాయం జరిగినట్లు.. సీన్ క్రియేట్ చేసుడేందని అన్నది కూడా ఈ పెద్దాయనే. మరిప్పుడు అదే ప్రశ్నలు మీకే ఎదురవుతున్నాయి. గులాబీ పార్టీకి అన్యాయం జరిగితే తామేం చేస్తామన్నది కాంగ్రెస్ నేతల ప్రశ్న.టైం ఎప్పుడూ ఒక లెక్కే ఉంటదనుకున్నారో ఏమో మరి. ఇప్పుడు మాత్రం తమ ఎమ్మెల్యేలు పార్టీ మారడం అదో భయంకరమైన తప్పు అన్నట్లుగా గులాబీ పార్టీలో హడావుడి పెరిగింది. అయ్యయ్యో చాలా అన్యాయం జరిగిపోయిందంటూ కోర్టులకెక్కారు. హైకోర్టు, సుప్రీందాకా వెళ్తామన్నారు. మీకే గనుక, కాపాడుకునే శక్తే గనుక.. ఉండి ఉంటే.. ఇలా జరిగి ఉండేదా అని కాంగ్రెస్ నేతలు పాత డైలాగ్ లను జస్ట్ రిమైండ్ చేస్తున్నారు.

10 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ లో చేరిక

మీకు ఆకర్షణ ఉంటే, నాయకత్వ పటిమ ఉంటే ఎందుకు కేసీఆర్ ను ఎమ్మెల్యేలు విడిచిపెడుతారని హస్తం నేతలు అడుగుతున్నారు. చెప్పాలంటే కేసీఆర్ డైలాగులన్నీ ఆయనకే రివర్స్ అయ్యాయి. నిజానికి గులాబీ పార్టీ నుంచి ఇప్పటికి 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ లో చేరారు. అందులో బీఆర్ఎస్ నుంచి గెలిచిన కడియం శ్రీహరి, దానం నాగేందర్, తెల్లం వెంకట్రావు.. హస్తం పార్టీలో మొదట జాయిన్ అయ్యారు. వారిపై అనర్హత వేటు వేయాలంటూ %దీ=ా% ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, వివేకానంద్‌లు పిటిషన్లు దాఖలు చేశారు. వీటితో పాటు దానం నాగేందర్‌పై వేటు వేయాలంటూ బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మరో పిటిషన్ వేశారు.

మోదీ టార్గెట్‌గా కవిత పోస్ట్.. బీఆర్ఎస్‌లో కొత్త జోష్

అయితే ఈ అనర్హత పిటిషన్‌లపై స్పీకర్ కార్యాలయంలో లేట్ అవుతుండడంతో వారు హైకోర్టును ఆశ్రయించారు. సెప్టెంబర్ 9న దీన్ని విచారించిన హైకోర్టు సింగిల్ జడ్జి.. 4 వారాల్లో అనర్హత పిటిషన్‌లపై షెడ్యూల్ ఖరారు చేయాలని తీర్పు ఇచ్చారు. సో అప్పుడు గులాబీ నేతల సంబరం ఒక్కటికాదు. ఇక అయిపోయింది.. స్పీకర్ నిర్ణయం తీసుకోవడమే తరువాయి. బైపోల్స్ వచ్చేస్తాయ్.. ఇక గెలిచేస్తాం.. తడాఖా చూపుతాం.. ఆ ఊహులకు అడ్డే లేకుండా పోయింది. అయితే కలలన్నీ నిజం కావు కదా. తాజాగా హైకోర్ట్ డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పుతో ఆ కలలన్నీ కరిగిపోయాయి.

సింగిల్ బెంచ్ ఉత్తర్వులను కొట్టేసిన సీజే బెంచ్

సింగిల్ జడ్జి తీర్పును సవాల్ చేస్తూ హైకోర్టులో అసెంబ్లీ కార్యదర్శి అప్పీల్ కు వెళ్లారు. వాటిపై ఇటీవలే వాదనలు ముగియగా.. హైకోర్టు తాజాగా తీర్పు వెలువరించింది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌లపై షెడ్యూల్ ఖరారు చేయాలంటూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను సీజే ధర్మాసనం కొట్టేసింది. తగిన సమయంలో నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌కు సూచించింది. 10వ షెడ్యూల్ ప్రకారం అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోవాలన్నది. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం, ఐదేళ్ల అసెంబ్లీ గడువును దృష్టిలో ఉంచుకొని స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని సూచించింది. శాసన వ్యవస్థ, న్యాయ వ్యవస్థ రెండు వేర్వేరు స్వతంత్ర ప్రతిపత్తి ఉన్న సంస్థలు. ఎవరి పరిధి వారిదే. అందుకే స్పీకర్ కు కోర్టులు ఆదేశాలు ఇవ్వవు.

గతంలో గుర్తుకు రాని అన్యాయం ఇప్పుడే గుర్తొచ్చిందా?

చట్టప్రకారం, చట్టానికి లోబడి నిర్ణయాలు తీసుకోవాలని సూచనలు మాత్రమే చేస్తాయి. సో ఇక్కడ జరిగింది చాలా క్లియర్ కట్ మ్యాటర్. టెన్త్ షెడ్యూల్ ప్రకారం స్పీకర్ ఫలానా టైంలోపల నిర్ణయం తీసుకోవాలన్న రూల్ లేదు. ఎందుకంటే వారు పార్టీ ఎందుకు మారారు.. అసలు మారారా లేదా.. మారితే ఎందుకు మారారు. ఏం ఇబ్బంది వచ్చింది.. టెక్నికల్ గా, చట్టపరంగా అన్ని అంశాలను బేరీజు వేసుకుని స్పీకర్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది.గులాబీ నేతలు అనుకున్నట్లు రాత్రికి రాత్రి తీసుకోవడానికి వీలు పడదు. సో ఇప్పుడు అసలు మ్యాటర్ ఏంటంటే.. గతంలో ఎమ్మెల్యేలను ఆకర్షించినప్పుడు, ఎల్పీలను విలీనం చేసుకున్నప్పుడు గుర్తుకు రాని అన్యాయం.. ఇప్పుడే గుర్తుకు రావడం అసలు పాయింట్. అప్పుడు నిర్ణయాలు తీసుకోకుండా ఇప్పుడు వేగంగా నిర్ణయాలు తీసుకోవాలనడం మరో పాయింట్. ఇదంతా చూస్తున్న వారు నీవు నేర్పిన విద్యయే.. అన్న పాత పద్యాన్ని గుర్తుకు తెచ్చుకుంటున్నారు. సింపుల్ మ్యాటర్.

# రేవంత్ వర్సెస్ కేటీఆర్ చుట్టూ తెలంగాణ రాజకీయం



హైదరాబాద్,తెలంగాణ రాజకీయం గత కొద్దిరోజులుగా రేవంత్ వర్సెస్ కేటీఆర్‌గా నడుస్తోంది. ఓవైపు గత బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని, అసమర్థ పాలనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కాంగ్రెస్ ఆరోపిస్తుంటే.. అధికారంలోకి వచ్చి ఏడాదవుతున్నా సీఎం రేవంత్‌కు పాలన చేతకావడంలేదని బీఆర్ఎస్ విమర్శిస్తోంది. రేవంత్ రెడ్డిని బీఆర్ఎస్ టార్గెట్ చేయగా.. కేటీఆర్‌ను కాంగ్రెస్ టార్గెట్ చేస్తోంది. రెండు పార్టీల కంటే ఇద్దరు వ్యక్తుల మధ్య వార్‌గా తెలంగాణ రాజకీయాల్లో గత కొద్దిరోజులుగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో కేటీఆర్ ఊచలు లెక్కపెట్టాల్సి వస్తోందంటూ రేవంత్ చేసిన వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయి. భారత రాష్ట్ర సమితి రాజకీయ వ్యూహం పక్కా ప్లాన్ ప్రకారం వెళ్తోంది. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ కన్నా రేవంత్ రెడ్డినే ఎక్కువ టార్గెట్ చేస్తోంది. ఒక్కో సారి కాంగ్రెస్ పార్టీని రేవంత్ నాశనం చేస్తున్నారని రాహుల్ కు చెబుతున్నారు కేటీఆర్. గాంధీభవన్ లో గాడ్సే అని.. గాడ్సే శిష్యుడు రేవంత్ అని తాజాగా కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీని ప్రత్యేకంగా బలహీనం చేయాల్సిన పని లేదు..రేవంత్ ను బలహీనం చేస్తే చాలని బీఆర్ఎస్ భావిస్తోంది. హైకమాండ్ వద్ద రేవంత్ పలుకుబడి తగ్గించగలిగితే..ఆయన పనైపోయినట్లేనని తమ పని సులువు అవుతుందని అనుకుంటున్నారు. కేసీఆర్‌కు ఎదురు లేదు అనుకున్న రోజుల్లో.. ఆయనకు పోటీగా ఉన్న నేత దరిదాపుల్లో లేరు. అయితే కింది స్థాయి నుంచి వచ్చిన రేవంత్ రెడ్డి పదేళ్లలోనే సీన్ మార్చేశారు. కేసీఆర్ కు తానే ధీటైన నేత అని నిరూపించారు. దీంతో ప్రజలు ఆయన వైపు మొగ్గారు. కేసీఆర్ ని గద్దె దించి సీఎం పీఠం అయన ఎక్కారు. ఒక వేళ రేవంత్ కాకపోతే కాంగ్రెస్ పార్టీలో కేసీఆర్ కు ధీటైన నేత ఎవరూ లేరన్న అభిప్రాయం ఉండేది. 2014, 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోవడానికి అదే కారణమని 2023లో గెలవడానికి కేసీఆర్ ధీటైన నాయకత్వం ఉండటమే కారణమని రాజకీయ విశ్లేషకులు చెబుతారు. రేవంత్ రెడ్డి ఇంకా యాభైల్లోనే ఉన్న నాయకుడు. ఆయన ఇప్పుడు సీఎంగా స్థిరపడిపోతే తెలంగాణలో ఆయనకు మించిన లీడర్ ఉండరు. ఈ విషయం రాజకీయాల్లో పండిపోయిన బీఆర్ఎస్ అధినేతకు తెలియనిది కాదు. ప్రస్తుతానికి రేవంత్ కు ఉన్న పవర్ హైకమాండ్ వద్ద ఉన్న పలుకుబడితో ముడిపడి ఉంది. ఆయనను హైకమాండ్ వద్ద బలహీనపరిస్తే ఆటోమేటిక్ గా తెలంగాణలోనూ బలహీనమవుతారని అప్పుడు కాంగ్రెస్ కూ దిక్కుండనది బీఆర్ఎస్ పెద్దలు ఆలోచిస్తున్నారు. అందుకే ఏకపక్షంగా రేవంత్ కుటుంబాన్ని టార్గెట్ చేస్తున్నారు. ఆయనతో పాటు కొడంగల్ నియోజకవర్గాన్ని సోదరుని తరపున చూసుకుంటున్న రేవంత్ సోదరుడు తిరుపతిరెడ్డిపైనా ఆరోపణలు చేస్తున్నారు. ఆయన కుటుంబసభ్యులపై పదే పదే ఆరోపణలు చేస్తున్నారు. విషయం ఉన్నా లేకపోయినా దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదులు చేసి ఏదో జరుగుతోందన్న అభిప్రాయం కల్పించే ప్రయత్నం చేస్తున్నారు. బీఆర్ఎస్ వ్యూహం రేవంత్ రెడ్డి కి అర్థమై ఉంటుంది. కాంగ్రెస్ పార్టీని కాదని తనను టార్గెట్ చేస్తున్నారని.. తన కుటుంబాన్ని టార్గెట్ చేయడం ద్వారా కాంగ్రెస్ పార్టీని దెబ్బకొట్టాలని అనుకుంటున్నారని ఆయనకు సులువుగానే అర్థమైపోయి ఉంటుంది. అందుకే విజయోత్సవ సభల్లో రేవంత్ కేసీఆర్ పై తీవ్రంగా విరుచుకుపడుతున్నారు. తాను బీఆర్ఎస్ ను తొక్కుకుంటూ వచ్చానని మరోసారి మొలకెత్త నీయనని హెచ్చరికలు జారీ చేశారు. అంటే.. తెలంగాణ రాజకీయం రేవంత్ వర్సెస్ బీఆర్ఎస్ అన్నట్లుగా మారడం స్పష్టమైంది. ఐతే, బీఆర్ఎస్‌కు అర్థంకాని విషయం ఏమిటంటే..ఇప్పుడు కాంగ్రెస్ అధిష్టానం మునపటిలా బలంగా లేదు. పైగా, రేవంత్‌ని దించేస్తే. ఆ స్థాయి ప్రజాకర్షణ కలిగిన నేత ఎవరు? ఈ ప్రశ్నకు కాంగ్రెస్ అధిష్టానం దగ్గర సమాధానం లేదు..అదే రేవంత్ బలం..బీఆర్ఎస్‌కు ఇప్పటికే ఈ విషయం అర్థం కావాలి.

# ఉన్నత విద్యలో యువతుల హవా



అమరావతి,ఉన్నత విద్యలో యువతులు ఆధిపత్యం సాధిస్తున్నారు. దేశంలో తొలిసారిగా యువకుల కంటే యువతుల అధిక సంఖ్యలో ఉన్నత విద్యా కోర్సుల్లో చేరుతున్నారు. ఉన్నత విద్యా సంస్థల్లో చేరికలను సూచించే గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో (జీఈఆర్)లో 2017-18 నుంచి యువకులను యువతులు అధిగవి?ంచారు. యువకుల జీఈఆర్ 28.4శాతం ఉండగా.. యువతుల జీఈఆర్ 28.5శాతంగా నమోదైంది.

2017-22 మధ్య ఐదేళ్లలో ఉన్నత విద్యా రంగంలో వచ్చిన విశేష మార్పులు దేశ ఆర్థిక వ్యవస్థపై సానుకూల ప్రభావం కనబరుస్తోందని భారత పరిశ్రమల సమాఖ్య(సీఐఐ)-డెలాయిట్ సంయుక్త అధ్యయన నివేదిక- 2024 వెల్లడించింది. సీఐఐ-డెలాయిట్ సంయుక్తంగా 2017-22 మధ్య కాలంలో దేశ ఉన్నత విద్యా రంగం తీరుతెన్నులను విశ్లేషించాయి.

నివేదికలోని ప్రధాన అంశాలు ....

-దేశంలో ఉన్నత విద్యను అందించే కాలేజీల సంఖ్య గణనీయంగా పెరిగింది. 2017లో దేశంలో 39,050 కాలేజీలు ఉండగా 2022 నాటికి 42,825కు పెరిగాయి.

- ఉన్నత విద్యా సంస్థల్లో విద్యార్థుల ప్రవేశాన్ని సూచించే 'గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో(జీఈఆర్) చెప్పుకోదగ్గ స్థాయిలో పెరిగింది. 2017-18లో జీఈఆర్ 24.6శాతం ఉండగా... 2021?22 నాటికి 28.4శాతానికి పెరగడం విశేషం.

-ఉన్నత విద్యా సంస్థల్లో యువతుల జీఈఆర్ కూడా పెరగడం సానుకూల పరిణామం. యువతుల జీఈఆర్ 2017-18లో 25.6శాతం ఉండగా 2021-22నాటికి 28.5శాతానికి పెరిగింది.

-ఉన్నత విద్యా సంస్థల్లో యువకుల జీఈఆర్ 2017-18లో 24.6శాతం ఉండగా, 2021-22నాటికి 28.4 శాతానికి చేరింది. ఈ ఐదేళ్లలోను యువతుల జీఈఆర్ అధికంగా ఉన్నట్లు స్పష్టమవుతోంది.

-ఉన్నత విద్యా సంస్థల్లో అధ్యాపకులు, విద్యార్థుల నిష్పత్తి కూడా క్రమంగా తగ్గుతోంది. ఐదేళ్లలో ఉన్నత విద్యా రంగంలో అధ్యాపకుల పోస్టులను భర్తీ చేయడంతో ఇది సాధ్యపడింది. 2017-18లో 25 మంది విద్యార్థులకు ఒక అధ్యాపకుడు ఉండగా... 2021-22 నాటికి 23 మంది విద్యార్థులకు ఒక అధ్యాపకుడు ఉన్నారు.

-ఇక దేశంలో ఉన్నత విద్యా కోర్సుల్లో ప్రవేశాలు గణనీయంగా పెరిగాయి. 2017-18లో దేశంలో మొత్తం 1,61,412 మంది పీహెచ్‌డీ కోర్సుల్లో చేరారు. 2021-22లో ఏకంగా 2,12,522 మంది పీహెచ్‌డీ కోసం ఎన్‌రోల్ చేసుకోవడం విశేషం.

పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సుల్లో 2017-18లో 29.40 లక్షల మంది విద్యార్థులు చేరగా... 2021-22

విద్యా సంవత్సరంలో 37.50 లక్షల మంది విద్యార్థులు చేరారు. అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో 2017-18లో 2.64 కోట్ల మంది విద్యార్థులు చేరగా, 2021-22 విద్యా సంవత్సరంలో 3.07కోట్ల మంది ప్రవేశంపొందారు.

# పుతిన్..నెతన్యాహు..యుద్ధ ప్రభువులు..అంతర్జాతీయ అరెస్ట్ వారెంట్లు



ఇజ్రాయెల,ప్రపంచంలో రెండు యుద్ధాలు జరుగుతున్నాయ్.. ఒకటి రష్యా-ఉక్రెయిన్ మధ్యన.. మరోటి ఇజ్రాయెల్-హమాస్ మధ్యన.. అయితే.. రష్యా అధినేత పుతిన్, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ వీరిద్దరు మాత్రం వార్తల్లో వ్యక్తులుగా మిగిలిపోయారు. తమ లక్ష్యాలను చేరేందుకు రెండున్నరేళ్లుగా పుతిన్, 13 నెలలుగా నెతన్యాహూ యుద్ధాన్ని నడిపిస్తున్నారు. మరి వీరిని ఏ కోర్టులూ ఆపలేవా..? అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు (ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్టు-ఐసీసీ) ఒకటి ఉందని తెలుసా?

అప్పట్లోనే పుతిన్ కు వారెంటు

పుతిన్ ఉక్రెయిన్ మీద యుద్ధం మొదలుపెట్టిన మొదట్లోనే కొత్తలోనే తీవ్ర విమర్శలను ఎదుర్కొన్నారు. అయితే, రెండున్నరేళ్ల తర్వాత ఉక్రెయిన్ లో నేరాలను గాను ఈ ఏడాది ఆగస్టులో ఐసీసీ వారెంట్ జారీ చేసింది. ఓ దశలో పుతిన్ సెప్టెంబరులో మంగోలియాకు వెళ్తారని అక్కడ ఆయనను అరెస్టు చేస్తారనే కథనాలు వచ్చాయి. కానీ, అదేమీ జరగలేదు. కాగా, ఉక్రెయిన్ లోని ఆక్రమిత ప్రాంతాల నుంచి పిల్లలను రష్యాకు చట్టవిరుద్ధంగా తరలించడం వంటి యుద్ధ నేరాలను ఐసీసీ పుతిన్ పై మోపింది. ఆయన అరెస్ట్ పై 2023లోనూ కథనాలు వచ్చాయి. పుతిన్ పై పాశ్చాత్య దేశాలు ఆంక్షలు విధించాయి.

ఇప్పుడు నెతన్యాహూకూ..

గత ఏడాది అక్టోబరు 7న గాజా నుంచి వచ్చిన హమాస్ ఉగ్రవాదులు ఇజ్రాయెల్ పై దాడికి దిగి మారణకాండకు కారణమయ్యారు. అప్పటినుంచి హమాస్ ను లక్ష్యంగా చేసుకుని గాజాపై విరుచుకుపడుతూనే ఉంది ఇజ్రాయెల్. కానీ, ఎంతకూ ఈ యుద్ధం తెమలడం లేదు. పైగా హెజ్బొల్లా, ఇరాన్ కూడా ప్రవేశించాయి. హెజ్బొల్లాలను అణచివేసేందుకు లెబనాన్ పై ఇజ్రాయెల్ దాడులు చేస్తోంది. తాజాగా నెతన్యాహు పైనా అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు అరెస్టు వారెంట్ జారీ చేసింది. గాజాలో యుద్ధ నేరాలు, అమానుష చర్యలే దీనికి కారణమని పేర్కొంది. ఇజ్రాయెల్ రక్షణ శాఖ మాజీ మంత్రి యోవ్ గ్యాలంట్, హమాస్ నేతలు మహ్మద్ డెయిఫ్, యాహ్యా సిన్వర్, ఇస్మాయిల్ హనియేల పైనా అరెస్ట్ వారెంట్లు జారీ అవడం గమనార్హం. నెతన్యాహు, గ్యాలంట్.. గాజాలో హత్యలు, హింస, అమానవీయ చర్యలతో పాటు ఆకలిచావుల వంటి యుద్ధ నేరాలకు పాల్పడినట్లు ఐసీసీ ఆరోపించింది. అయితే, హమాస్ నేతలు సిన్వర్, హనియేలను ఇప్పటికే ఇజ్రాయెల్ హతమార్చిన సంగతి తెలిసిందే.

బైడెన్ అభ్యంతరం

రష్యా, అమెరికా రెండూ యుద్ధం చేస్తున్న దేశాలే. అయితే, పుతిన్ పై ఐసీసీ అరెస్టు వారెంట్ జారీ అయిన సమయంలో లేని అభ్యంతరాన్ని నెతన్యాహూ విషయంలో లేవనెత్తారు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్. ఇజ్రాయెల్, హమాస్ లను సమంగా చూడడాన్ని ఆయన వ్యతిరేకిస్తున్నారు. తమది ఇజ్రాయెల్ పక్షమేనని చెప్పారు. మరోవైపు నెతన్యాహూ ఐసీసీ చర్యను తీవ్రంగా ఖండించారు. అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు తప్పుడు, అసంబద్ధ ఆరోపణలను తిరస్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. అది పక్షపాత, వివక్షాపూరిత రాజకీయ సంస్థ అని అభివర్ణించారు.

# అదానీతో ఒప్పందాలపై పీసీసీ చీఫ్ మహేశ కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు



హైదరాబాద్,అదానీ వ్యవహారంపై పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. అదానీతో చేసుకున్న ఒప్పందాలపై పునరాలోచిస్తామని అన్నారు. అదానీకి ఇప్పటివరకు కూడా ఇంచు భూమి ఇవ్వలేదని తెలిపారు.చట్టానికి లోబడి ఒప్పందాలపై ముందుకెళ్తామన్నారు.అదానీ వ్యవహారం ఇప్పుడు దేశవ్యాప్తంగా హాట్ టాపిక్ అయిన సంగతి తెలిసిందే. తెలంగాణ ప్రభుత్వం కూడా అదానీతో ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. అదానీతో చేసుకున్న ఒప్పందాలపై పునరాలోచిస్తామని అన్నారు. అదానీకి ఇప్పటివరకు కూడా ఇంచు భూమి ఇవ్వలేదని తెలిపారు.రాహుల్ గాంధీ మాటే.. మా మాట అని స్పష్టం చేశారు. చట్టానికి లోబడి ఒప్పందాలపై ముందుకెళ్తామన్నారు. నరేంద్ర మోదీ ప్రధాని అయ్యాక అదానీకి లాభం చేకూర్చారని విమర్శించారు. అదానీ, అంబానికి ఆయన చాలా వెసులుబాటు కల్పించారని ఆరోపించారు. స్టాక్ మార్కెట్లను అదానీ మ్యానిప్యులేట్ చేశారని ఆరోపించారు. అదానీ అరెస్టయితే మోదీ ప్రధానిగా రాజీనామా చేయక తప్పదన్నారు. అదానీపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేసి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. స్కిల్ యూనివర్సిటీకి అదానీ రూ.100 కోట్లు ఇచ్చారని.. కేటీఆర్ రూ.50 కోట్లు ఇచ్చినా తీసుకుంటామన్నారు. డబ్బు వ్యామోహం కన్నా రాజకీయ వ్యామోహంతో చేసే పనులు చాలా డేంజరన్నారు. అదానీ న్యాయంగా ఒప్పందాలు చేసుకుంటే మాకు అభ్యంతరం లేదని తెలిపారు. మా ప్రభుత్వం అదానీతో చేసిన ఒప్పందాలపై జేపీసీ రిపోర్ట్ ప్రకారం ముందుకెళ్తామన్నారు. మరోవైపు పార్టీలో చేరికలపై కూడా మహేష్ కుమార్ గౌడ్ స్పందించారు. త్వరలో మరిన్ని చేరికలు ఉంటాయన్నారు. కేటీఆర్‌తో దగ్గరగా ఉండేవాళ్లు మాతో టచ్‌లో ఉన్నారని తెలిపారు. ఎంతమంది టచ్‌లో ఉన్నారో త్వరలోనే తెలుస్తుందన్నారు. మరోవైపు అదానీ వ్యవహారంపై తాజాగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా స్పందించారు. అమెరికా నుంచి ఆఫ్రికా వరకు ఈ వ్యవహారం వెలుగుచూసిందన్నారు. తెలంగాణలో కూడా అదానీ వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం సహకరిస్తున్నారని ఆరోపణలు చేశారు. " బీఆర్ఎస్ పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు అదానీ గ్రూప్ తెలంగాణకు రాలేదు. కాంగ్రెస్ హైకమాండ్‌కు తెలియకుండానే రేవంత్ అదానికి రెడ్ కార్పెడ్ పరిచారా ?. రూ.12,400 కోట్లతో ఎంవోయూలు కుదుర్చుకున్నారు. విద్యుత్‌కు సంబంధించి ప్రాజెక్టులు అదానీకి అప్పగించేందుకు రేవంత్ ప్రయత్నించారు. స్కిల్ యూనివర్సిటీకి ఆయన రూ.100 కోట్ల విరాళం అందించారు. అదానీతో చేసుకున్న ఒప్పందాలను ఇప్పుడు కెన్యా కూడా రద్దు చేసుకుంది. కానీ తెలంగాణ ప్రభుత్వం ఈ నిర్ణయం ఎందుకు తీసుకోవడం లేదు. రాహుల్‌గాంధీకి చిత్తశుద్ధి ఉంటే రాష్ట్రంలో చేసుకున్న ఒప్పందాలు రద్దు చేయించాలని" కేటీఆర్ డిమాండ్ చేశారు.

## ఫిరాయింపులపై స్పీకర్ చర్య తీసుకోవాలి

హైదరాబాద్, ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై శాసనసభాపతి నిర్ణయం తీసుకోకపోతే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు. అనర్హత పిటిషన్ల విషయమై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని బెంచ్ తీర్పుపై ఆయన స్పందించారు. మొన్నటి వరకు సభాపతిని ఆదేశించే అధికారం కోర్టుకు లేదని వాదించారని కేటీఆర్ గుర్తు చేశారు.

# ముస్లిం మత నాయకుడు నోమానీపై ఫిర్యాదు చేసిన బీజేపీ..



ముంబై:మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సమయంలో వివాదాస్పద ఫత్వా జారీ చేసిన ఇస్లామిక్ మత నాయకుడు మౌలానా సజ్జాద్ నోమానీపై బీజేపీ మైనారిటీ మోర్చా అధ్యక్షుడు జమాల్ సిద్ధిఖీ ఢిల్లీలో పోలీసులకు ఫిర్యాదు చేశారు.కాంగ్రెస్-ఉద్ధవ్ ఠాక్రే-శరద్ పవార్ కూటమికి ఓటేయాలని రాష్ట్రంలో ముస్లింలకు పిలుపునివ్వడంపై వీడియో వైరల్‌గా మారింది. మహారాష్ట్రలో బీజేపీ ఓటమి కేంద్ర ప్రభుత్వాన్ని అస్థిరపరచగలదని తాను నమ్ముతున్నానని నోమని అన్నారు. ఈ వీడియోపై మహారాష్ట్ర ప్రభుత్వం స్పందిస్తూ, కాంగ్రెస్ మరియు దాని మిత్రపక్షాలు ఓటమి భయంతో సమాజాన్ని విభజించడానికి ప్రయత్నిస్తున్నాయని పేర్కొంది.ఇదే కాకుండా.. నోమానీ మాట్లాడుతూ.. బీజేపీతో సంబంధం ఉన్న ముస్లింలను బహిష్కరించాలని, ఇస్లాం నుంచి తిరస్కరించాలని ఫత్వాలో పేర్కొన్నాడు. వివాదాస్పద ఫత్వాకు సంబంధించిన వీడియో కూడా విడుదలైంది. బీజేపీకి పనిచేస్తున్న ముస్లింలను విస్మరించాలని చెప్పారు. నోమానీ వ్యాఖ్యలు మహారాష్ట్రలో పాటు దేశవ్యాప్తంగా వివాదాస్పదమైంది. ఈ నేపథ్యంలో విషయం తీవ్రతను దృష్టిలో పెట్టుకుని అతడిపై కఠిన చర్యలు తీసుకోవాలని సిద్ధిఖీ ఢిల్లీ పోలీసులను కోరారు. ఈ ప్రకటన వల్ల సమాజంలో చీలికలు ఏర్పడి మత సామరస్యాలు చెలరేగే ప్రమాదం ఉందని, తక్షణమే చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుదారుడు పోలీసులకు విజ్ఞప్తి చేశారు." మసీదులు, ఇతర ప్రార్థనా స్థలాల వద్ద వారు(ముస్లింలు) ధిక్కారం, బెదిరింపులు ఎదుర్కొంటున్నారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com